- aruhi group
www.mahaaprabha.com

# నమస్తే మహాప్రభ

ప్రజల కోసం.., ప్రజలతో...మహాప్రభ

తెలుగు దినపత్రిక

శుక్రవారం
29-05-2026

సంపుటి : 01 సంచిక :67 పేజీలు : 08 వెల : ₹5/- తెలంగాణ , ఆంధ్రప్రదేశ్.

Published From RANGAREDDY TELANGANA.RNI NO : TGTEL/26/A0738 VOLUME 01 ISSUE 67 NAMASTEY MAHAAPRABHA



Mr. NAKKA RAJU
Chairman of Mahaaprabha

## ఎట్టకేలకు సిద్దరామయ్య రాజీనామా




- గవర్నర్ కార్యదర్శికి రాజీనామా లేఖ అందచేత
- అధిష్టానం ఆదేశాల మేరకు వైదొలుగుతున్నట్లు ప్రకటన
- జాతీయ రాజకీయాలకు వెళ్లే ఆలోచన లేదని వెల్లడి

బెంగళూరు, మే 28 మహాప్రభ

కర్నాటకానికి తెరపడింది. గతకొంతకాలంగా ఊహాగానాలతో సాగిన రాజకీయాలు మలుపు తిరిగాయి. కర్నాటకలో సిద్ధరామయ్య జమానా ముగిసింది. ఎట్టకేలకు కర్ణాటకలో నాయకత్వ మార్పు చోటుచేసుకుంది. ముఖ్యమంత్రి పదవికి సిద్ధరామయ్య రాజీనామా చేశారు. గురువారం మధ్యాహ్నం

-మిగతా 3 లో

## రాబోయే ఐదేండ్లూ భగభగలే..



- రికార్డ్‌స్థాయిలో ఉష్ణోగ్రతలు
- సగటున 1.9 డిగ్రీల సెల్సియస్ మేర ఉష్ణోగ్రతలు పెరుగొచ్చు
- ప్రపంచ వాతావరణ సంస్థ వెల్లడి

న్యూఢిల్లీ, మే 28 మహాప్రభ

రాబోయే ఐదేండ్లలో ప్రపంచ సగటు ఉష్ణోగ్రతలు 1.9 డిగ్రీల సెల్సియస్ వరకు పెరుగవచ్చునని ప్రపంచ వాతావరణ సంస్థ (డబ్ల్యూఎంవో) నివేదిక హెచ్చరించింది. ఉష్ణోగ్రతల పెరుగుదల 1.5 డిగ్రీల సెల్సియస్ దాటకుండా కట్టడి చేయాలన్నది 'పారిస్ ఒప్పందం' లక్ష్యం.

-మిగతా 3 లో

తెలుగుదేశం పార్టీ

### దేశంలోనే ధనిక ప్రాంతీయ

## పార్టీగా టీడీపీ..

- రూ. 228 కోట్ల ఆదాయంతో మొదటి స్థానం
- తర్వాత స్థానాల్లో తృణమూల్ కాంగ్రెస్, వైఎస్సార్‌సీపీ
- ఖర్చులో మొదటి స్థానంలో జగన్ మోహన్ రెడ్డి పార్టీ

న్యూఢిల్లీ, మే 28 మహాప్రభ

అత్యధిక ఆదాయంతో దేశంలోనే ధనిక ప్రాంతీయ పార్టీగా ఏపీకి చెందిన తెలుగుదేశం పార్టీ నిలిచింది. ప్రధాన ప్రాంతీయ పార్టీల ఆదాయ వ్యయాలను అసోసియేషన్ ఫర్ డెమోక్రాటిక్ రిఫామ్స్ (ఏడీఆర్) విశ్లేషించి తాజాగా నివేదిక విడుదల చేసింది. ఈ నివేదిక ప్రకారం రూ. 228.31 కోట్ల ఆదాయంతో టీడీపీ దేశంలోనే ప్రథమ స్థానంలో ఉంది. మమతా బెనర్జీకి చెందిన తృణమూల్ కాంగ్రెస్ రూ. 219.35 కోట్లతో ద్వితీయ స్థానంలో, ఏపీలోని వైఎస్ఆర్ కాంగ్రెస్ రూ. 219.35 కోట్ల ఆదాయంతో తృతీయ స్థానంలో ఉన్నాయి. ఇక ఖర్చుల పరంగా చూస్తే రూ. 340.20 కోట్లతో వైఎస్ఆర్ కాంగ్రెస్ మొదటి స్థానంలో ఉంది. ఈ పార్టీకి ఆదాయం కన్నా ఖర్చు రెట్టింపు కంటే ఎక్కువగా 142.33 శాతం ఉంది. తర్వాతి స్థానంలో 284.44 కోట్లతో

-మిగతా 3 లో

### తెలుగు జాతి గర్వించదగ్గ

# మహానేత ఎన్టీఆర్

మహానేతను గౌరవించడం ఏ పార్టీకి పరిమితం కాదు

- తెలుగు రాష్ట్రాల్లో ఎన్టీఆర్ సమర్థవంతమైన నేత
- ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటు రాష్ట్ర ఆత్మగౌరవ ప్రతీక
- విగ్రహం ఏర్పాటులో విమర్శలకు తావులేదు
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు
- అమీర్‌పేటలో ఎన్టీఆర్ విగ్రహం ఆవిష్కరణ


హైదరాబాద్, మే 28 మహాప్రభ

హైదరాబాద్‌లోని అమీర్‌పేట మైత్రివనం జంక్షన్ వద్ద ఏర్పాటు చేసిన నందమూరి తారక రామారావు విగ్రహాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గురువారం ఘనంగా ఆవిష్కరించారు. కాంగ్రెస్ సీఎం ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించడం ఏమిటని చాలా మంది విమర్శిస్తున్నారని.. ఎవరు ఏమనుకున్నా, ఎలాంటి విమర్శలు చేసినా నేను భయపడను, వెనక్కి తగ్గను అని స్పష్టం చేశారు. తెలుగు జాతి గర్వించదగ్గ మహానేతను గౌరవించడం ఏ పార్టీకి పరిమితం కాదని, అది అందరి బాధ్యత అని ఆయన ఉద్ఘాటించారు. జాతీయ స్థాయిలో ఇందిరా

-మిగతా 3 లో



కేసీఆర్‌కు రాజకీయ భిక్ష పెట్టింది ఎన్టీఆరే!



### హర్మూజ్ జలసంధి

## ఎవరి సొత్తు కాదు

- చర్చలు విఫలమైతే వెనక్కి తగ్గబోం
- అవసరమైతే రక్షణ మంత్రిని రంగంలోకి
- ఇరాన్ అణ్వాయుధాలు సంపాదించకూడదు
- ప్రపంచ భద్రత కోసం ప్రయత్నిస్తున్నాం
- అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తీవ్ర వ్యాఖ్యలు

మాస్కో, మే 28 మహాప్రభ

ఇరాన్‌తో శాంతి చర్చలు కొనసాగిస్తున్నామని చెబుతూనే మరోవైపు అమెరికా సైనిక చర్యలకు దిగుతోంది. పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్న వేళ హర్మూజ్ జలసంధి సమీపంలోని ఇరాన్ మిలిటరీ స్థావరాలను లక్ష్యంగా చేసుకుని అమెరికా వైమానిక దాడులు నిర్వహించింది. ఈ దాడుల్లో పలు ఇరాన్ డ్రోన్లను కూల్చివేసినట్లు అమెరికా రక్షణశాఖ వెల్లడించింది. హర్మూజ్ ప్రాంతంలో తమ సైన్యానికి ముప్పు పెరుగుతోందని, అందుకే ముందస్తు చర్యగా ఈ దాడులు చేపట్టామని అధికారులు తెలిపారు. ఇక ఇరాన్‌తో జరుగుతున్న శాంతి చర్చలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. చర్చలు విఫలమైతే తాము వెనక్కి తగ్గబోమని,

-మిగతా 3 లో



## చంద్రుడిపై మానవుల నగరం..

- నాసా ప్రతిష్టాత్మక ప్రాజెక్టు
- 20 బిలియన్ డాలర్ల ఖర్చుతో 2032 నాటికి నిర్మాణం పూర్తి

న్యూయార్క్, మే 28 మహాప్రభ

అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ నాసా మరో చరిత్రాత్మక ప్రాజెక్టుకు శ్రీకారం చుడుతున్నది. చంద్రుడిపై మానవుల శాశ్వత నివాసం కోసం ఓ నగరాన్నే నిర్మించబోతున్నది. 20 బిలియన్ డాలర్ల ఖర్చుతో చేపడుతున్న ఈ ప్రాజెక్టు 2032 వరకు పూర్తవుతుందని నాసా ప్రకటించింది. దీంతో భూమి బయట మానవులు బతికే మొదటి నివాసం ఇదే కాబోతున్నది. ఈ ఏడాది చివరికల్లా దీన్ని ప్రారంభిస్తారు. మొదట్లో చిన్న క్యాంపులాగా ప్రారంభించి తర్వాత దాన్ని విస్తరించబోతున్నారు.

-మిగతా 3 లో

## దేశానికి ఆదర్శంగా ఫ్యూచర్ సిటీ



- నిర్మాణ పనులను పరిశీలించిన మంత్రులు
- భవిష్యత్ అవసరాల దృష్ట్యా నగర నిర్మాణం
- మంత్రులు పొంగులేటి, శ్రీధర్ బాబుల వెల్లడి

హైదరాబాద్, మే 28 మహాప్రభ

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అభివృద్ధి చేస్తున్న ఫ్యూచర్ సిటీ దేశానికే ఆదర్శంగా నిలిచే విధంగా రూపుదిద్దుకుంటోందని రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి, శ్రీధర్ బాబు పేర్కొన్నారు. గురువారం ఫ్యూచర్ సిటీలో నిర్మాణంలో ఉన్న ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ (ఎఫ్‌సీడీఏ) కార్యాలయ భవనం, స్కిల్ యూనివర్సిటీ నిర్మాణ పనులను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ

-మిగతా 3 లో

## తెలంగాణకు చల్లని కబురు

- రెండురోజుల్లో రుతుపవనాల ఆగమనం



3 లో

### 20 లక్షల ఇండ్లు కట్టిస్తేనే

# ఓట్లడగాలి

మాట నిలబెట్టుకునే దమ్ముందా?




- శపథాలు కాదు చేసి చూపించు
- డబ్బా ఇళ్లు కాదు..డబుల్ ఇళ్లు కట్టిన ఘనత మాది
- పొంగులేటి సవాల్‌పై కెటిఆర్ ప్రతిసవాల్

హైదరాబాద్ మే 28 మహాప్రభ

హైదరాబాద్‌లో 20 లక్షల ఇండ్లు కట్టిస్తేనే ప్రజలను ఓట్లు అడగాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సవాల్ విసిరారు. గతంలో 20 లక్షల ఇందిరమ్మ ఇండ్లు కట్టాకే ఓట్లు అడుగుతామని సవాల్ చేసిన మంత్రి పొంగులేటికి ఆ మాట నిలబెట్టుకునే దమ్ముందా? అని ప్రశ్నించారు. సవాళ్లు చేయడం, ఆపై పారిపోవడం నీతిలేని కాంగ్రెస్ నేతలకు అలవాటేనని గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శపథాలు చేయడం కాదనీ, చాతనైతే చేసి చూపించాలని కోరారు. దమ్ముంటే మ్యానిఫెస్టోలో

-మిగతా 3 లో



### ఉక్రెయిన్‌తో ఎడతెగని

## రష్యా యుద్ధం

- భారీగా సైనిక సంపదను కోల్పోయిన రష్యా
- 5లక్షల మంది సైన్యం మరణించినట్లు వార్తలు

మాస్కో, మే 28 మహాప్రభ

రష్యా-ఉక్రెయిన్ మధ్య నాలుగేళ్లుగా కొనసాగుతోన్న యుద్ధం ఎప్పటికి ముగుస్తుందో తెలియని పరిస్థితి. ఈ నేపథ్యంలో కొన్ని సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. 2022 నుంచి జరుగుతోన్న ఈ ఘర్షణల్లో రష్యాకు సైనిక పరంగా భారీ నష్టం వాటిల్లినట్లు కనిపిస్తోంది. ఈ పోరులో 5 లక్షల మంది మాస్కో సైనికులు ప్రాణాలు కోల్పోయారని బ్రిటన్ నిఘా వర్గాలు అంచనావేశాయి. మరోవైపు, యుద్ధం ప్రారంభమైన దగ్గరినుంచి తాము 55వేలమంది సైనికులను కోల్పోయినట్లు ఉక్రెయిన్ అధ్యక్షుడు

-మిగతా 3 లో

## ప్రతి పౌరుడికి సమగ్ర సంక్షేమ కార్డు..

- అన్ని శాఖల లబ్ధిదారుల డేటా సమీకరణ
- పారదర్శక సేవలకు ప్రత్యేక చర్యలు
- రాష్ట్ర సీఎం రేవంత్ కీలక ఆదేశాలు జారీ



హైదరాబాద్, మే 28 మహాప్రభ

తెలంగాణ రాష్ట్రంలోని ప్రతి పౌరుడికి అందుతున్న సంక్షేమ పథకాల వివరాలన్నీ ఒకే కార్డులో ఉండేలా సమగ్ర సంక్షేమ కార్డును (యూనిఫైడ్ కార్డ్ ) రూపొందించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఏ పౌరుడికి ఏ శాఖ ద్వారా, ఏ పథకం కింద, ఎంత మేర లబ్ధి చేకూరుతోందో ఈ కార్డ్ ద్వారా స్పష్టంగా తెలిసేలా ఉండాలని సూచించారు. తక్షణమే అందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని, అన్ని శాఖల నుంచి లబ్ధిదారుల డేటాను సేకరించేందుకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని ఆదేశించారు. మంత్రి శ్రీధర్ బాబు,

-మిగతా 3 లో

# నాలుగు రాష్ట్రాలకు కొత్త అధ్యక్షుల్ని నియమించిన బీజేపీ..

-ఢిల్లీకి హర్ష్ మల్హోత్రా, పంజాబ్‌కు కేవల్ సింగ్




**న్యూఢిల్లీ మే 28 మహాప్రభ**
ఇటీవలే పశ్చిమ బెంగాల్, అసోం, పుదుచ్చేరిలో విక్టరీ సాధించిన బీజేపీ ఇప్పుడు మిగతా రాష్ట్రాలపై ఫోకస్ చేసింది. పార్టీ సంస్థాగత బలోపేతంపై కీలక నిర్ణయం తీసుకుంది. నాలుగు రాష్ట్రాలకు కొత్త అధ్యక్షుల్ని నియమిస్తూ గురువారం బీజేపీ జాతీయాధ్యక్షుడు నితిన్ నబిన్ ఆదేశాలు జారీ చేశారు.నాలుగు రాష్ట్రాలకు వేర్వేరు నోటిఫికేషన్ల ద్వారా కొత్త అధ్యక్షుల్ని నియమిస్తున్నట్లు వెల్లడించారు. దీని ప్రకారం ఢిల్లీ బీజేపీ అధ్యక్షుడిగా హర్ష్ మల్హోత్రాను, పంజాబ్ బీజేపీ అధ్యక్షుడిగా కేవల్ సింగ్ ధిల్లాన్‌ను, హరియానా బీజేపీ అధ్యక్షురాలిగా అర్చనా గుప్తాను, త్రిపుర బీజేపీ అధ్యక్షుడిగా అభిషేక్ దేవ్‌రాయ్‌ను నియమించారు. ఇంతకుముందు ఢిల్లీకి అధ్యక్షుడిగా వీరేంద్ర సచ్‌దేవా, పంజాబ్ అధ్యక్షుడిగా సునీల్ ఝకార్, హరియాణా అధ్యక్షుడిగా మోహన్ లాల్ బదోలి, త్రిపుర అధ్యక్షుడిగా రజీబ్ భట్టాచార్జీ ఉండేవారు. వీరి స్థానంలో కొత్తవారిని నియమిస్తూ బీజేపీ నిర్ణయం తీసుకుంది. పంజాబ్ అధ్యక్షుడిగా ఎన్నికైన కేవల్ సింగ్ ధిల్లాన్ గతంలో ఎమ్మెల్యేగా పనిచేశారు. అంతకుముందు కాంగ్రెస్‌లో ఉండేవారు. తర్వాత పార్టీకి రాజీనామా చేసి బీజేపీలో చేరారు.అలాగే, పంజాబ్ మాజీ సీఎం కెప్టెన్ అమరీందర్ సింగ్‌కు సన్నిహితుడు. ఢిల్లీ బీజేపీ అధ్యక్షుడిగా నియామకమైన హర్ష్ మల్హోత్రా తొలిసారి ఎంపీగా గెలిచారు. ఆయన పార్టీ కోసం చాలా శ్రమించారు. కేంద్ర మంత్రిగా కొనసాగుతున్నారు. హరియాణా అధ్యక్షురాలిగా ఎన్నికైన అర్చనా గుప్తా రాష్ట్ర జనరల్ సెక్రెటరీగా పని చేస్తున్నారు. ఆమెకు ఈసారి అధ్యక్షురాలిగా ప్రమోషన్ లభించింది. త్రిపురలో అత్యంత కీలక నియోజకవర్గమైన మతార్బారి నుంచి పోటీ చేసి గెలిచారు. ఆయనకు తాజాగా అధ్యక్షుడిగా పదవి దక్కింది.

# ఐదు లక్షల మంది సైనికులను బలిచేసిన రష్యా..!



**న్యూఢిల్లీ మే 28 మహాప్రభ**
రష్యా-ఉక్రెయిన్ దేశాల మధ్య నాలుగేళ్లుగా యుద్ధం కొనసాగుతూనే ఉన్నది. ఆ యుద్ధం ఎప్పటికి ముగుస్తుందో కూడా తెలియని పరిస్థితులు నెలకొని ఉన్నాయి. ఈ నేపథ్యంలో కొన్ని సంచలన గణాంకాలు వెలుగులోకి వచ్చాయి. నాలుగేళ్లుగా జరుగుతున్న ఈ యుద్ధంతో రష్యాకు సైనికపరంగా భారీ నష్టం వాటిల్లినట్లు గణాంకాలు చెబుతున్నాయి. ఈ యుద్దంలో ఇప్పటివరకు 5 లక్షల మంది రష్యా సైనికులు ప్రాణాలు కోల్పోయారని బ్రిటన్ నిఘా వర్గాలు అంచనావేశాయి. ఇదిలావుంటే యుద్ధం మొదలైన దగ్గరి నుంచి తాము 55 వేల మంది సైనికులను కోల్పోయామని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీ ఈ ఏడాది ఫిబ్రవరిలో వెల్లడించారు. కానీ ఇరువైపులా ప్రాణనష్టం భారీగానే ఉన్నప్పటికీ రెండు దేశాలు వాస్తవ లెక్కలను వెల్లడించట్లేదనే ఆరోపణలున్నాయి. గత నాలుగేళ్లుగా డాన్‌బాస్ ప్రాంతంలోని ఉక్రెయిన్ స్థావరాలపై దాడుల కోసం రష్యా తన సైనికులను దశల వారీగా మోహరించింది. కొత్తగా చేరిన సైనికులు, జైళ్ల నుంచి నియమించుకున్నవారు ఈ ఘర్షణల్లో పాల్గొన్నారు. వారికి సరైన శిక్షణ లేకపోవడం కూడా యుద్ధరంగంలో భారీ ప్రాణనష్టానికి దారితీసినట్లు తెలుస్తోంది.

# మమతాబెనర్జీకి దెబ్బమీద దెబ్బ..

-మరో సీనియర్ నేత రాజీనామా

**న్యూఢిల్లీ మే 28 మహాప్రభ**



పశ్చిమబెంగాల్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాల నాటి నుంచి మమతాబెనర్జీ కి వరుస షాక్‌లు తగులుతున్నాయి. తృణమూల్ కాంగ్రెస్ పార్టీకి చెందిన కీలక నాయకులు వరుసగా రాజీనామా చేస్తున్నారు. తాజాగా సీనియర్ నాయకుడు, మాజీ రాజ్యసభ సభ్యుడు డాక్టర్ శంతను సేన్ పార్టీ జాతీయ అధికార ప్రతినిధి పదవికి రాజీనామా చేశారు. నిన్న కకోలీ ఘోష్ దస్తీదార్ పార్టీ ప్రాథమిక సభ్యత్వంతోపాటు అన్ని పదవులకు రాజీనామా చేశారు. ఆ మరుసటి రోజే తన రాజీనామాతో శంతను సేన్ షాకిచ్చారు. 2024 నాటి ఆర్జీకర్ హత్యాచార కేసు, పార్టీపై వస్తున్న నిరంతర అవినీతి ఆరోపణలతో తాను తీవ్ర మనస్తాపం చెంది ఈ నిర్ణయం తీసుకున్నానని శంతను సేన్ పేర్కొన్నారు. పార్టీ అధికార ప్రతినిధిగా తన పాత్రను నిర్వర్తించే స్థితిలో తాను లేనని తెలిపారు. వివిధ సమయాల్లో తాను పార్టీ నిర్ణయాలతో ఏకీభవించలేదని, అనేక వివాదాస్పద అంశాలపై తాను బహిరంగంగానే ప్రశ్నించానని ఆయన పేర్కొన్నారు. అందుకే ప్రజలు తనను వివిధ సందర్భాలలో ఎంతగానో ప్రశంసించారని పేర్కొన్నారు. ఆర్జీకర్ కేసు, నిరుద్యోగం, అవినీతి సహా వివిధ అంశాల కారణంగా ప్రజలు తమను ఓడించారని, అందుకే అధికార ప్రతినిధిగా మాట్లాడటానికి తన మనసు అంగీకరించడం లేదని పేర్కొన్నారు

# పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మళ్లీ తీవ్రం

## అమెరికా సైనిక స్థావరాలపై ఇరాన్ ప్రతీకార దాడులు..

**న్యూఢిల్లీ మే 28 మహాప్రభ**
అమెరికా-ఇరాన్ దేశాల మధ్య దాడులు, ప్రతిదాడులతో పశ్చిమాసియా లో మరోసారి ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఓవైపు శాంతి ఒప్పందంపై చర్చలు కొనసాగుతుండగానే.. అమెరికా-ఇరాన్ మధ్య భీకర ఘర్షణలు చోటుచేసుకున్నాయి. హర్మూజ్ జలసంది సమీపంలో ఇరాన్ స్థావరాలపై అమెరికా దాడులకు ప్రతీకారంగా.. ఇరాన్ ప్రతిదాడులు చేసింది. క్షిపణులు ప్రయోగించింది. అగ్రరాజ్య సైనిక స్థావరాలే లక్ష్యంగా ఈ దాడులు చేపట్టింది.హర్మూజ్



జలసంధి సమీపంలోని ఇరాన్ సైనిక స్థావరాలపై అమెరికా దళాలు దాడులు చేశాయి. ఇది జరిగిన కాసేపటికే బందర్ అబ్బాస్ పోర్టు వద్ద కూడా పలుమార్లు పేలుడు శబ్దాలు వినిపించాయి. ఈ దాడులను 'ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కోర్' దురాక్రమణ చర్యగా అభివర్ణించింది. అమెరికా పదేపదే కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘిస్తుందని ఇరాన్ ఆరోపించింది. ఇలాంటి దురాక్రమణలు కొనసాగితే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించింది. అమెరికా తాజా దాడులకు ప్రతీకారంగా గల్ఫ్ దేశాల్లోని అమెరికా బేస్‌లను తాము లక్ష్యంగా చేసుకున్నట్లు ఐఆర్‌జీసీ తెలిపింది. కానీ అది ఎక్కడి స్థావరం అనే విషయాన్ని వెల్లడించలేదు. అయితే తమ గగనతలంపైకి క్షిపణులు, డ్రోన్‌లు దూసుకొచ్చాయని కువైట్ దళాలు పేర్కొన్నాయి. వాటిని సమర్థవంతంగా అడ్డుకున్నట్లు వెల్లడించాయి.

# భారత మామిడిపండ్లపై జపాన్‌లో 20 ఏళ్ల తర్వాత మళ్లీ నిషేధం..!

**న్యూఢిల్లీ మే 28 మహాప్రభ**
భారత మామిడి ఎగుమతిదారులకు జపాన్ ప్రభుత్వం షాకిచ్చింది. ఈ సీజన్‌కుగాను భారత మామిడి పండ్ల దిగుమతులను పూర్తిగా నిషేధిస్తున్నట్లు ప్రకటించింది. భారత్ లోని క్రిమిసంహారక కేంద్రాల్లో నాణ్యతా ప్రమాణాలు సరిగా లేవని జపాన్ తనిఖీ బృందం గుర్తించడమే ఇందుకు ప్రధాన కారణమని తెలుస్తోంది. ఈ పరిణామంతో మామిడి ఎగుమతిదారులు తీవ్ర నిరాశకు గురయ్యారు. ఉత్తరప్రదేశ్‌లోని రెహ్మాన్‌పూర్‌లో ఉన్న ఒక ప్లాంట్‌లో వేపర్ హీట్ ట్రీట్‌మెంట్ ప్రక్రియలో లోపాలు ఉన్నట్లు జపాన్ అధికారులు గుర్తించారు.పండ్లను తెగుళ్లు, కీటకాల నుంచి రక్షించడానికి ఈ ప్రక్రియ చాలా కీలకం. ఈ నేపథ్యంలో మార్చి 2 తర్వాత జారీ చేసిన భారతీయ సర్టిఫికెట్లతో వచ్చే మామిడి షిప్‌మెంట్‌లను అంగీకరించబోమని జపాన్‌కు చెందిన యొకోహామా



ప్లాంట్ ప్రొటెక్షన్ అసోసియేషన్ స్పష్టంచేసింది. ఈ నిషేధం కారణంగా కేసర్, అల్ఫాన్సో, లంగ్రా, బంగినపల్లి వంటి ప్రసిద్ధ రకాల ఎగుమతులు నిలిచిపోయాయి. భారత మామిడి ఎగుమతిదారులు ఇప్పటికే పలు సవాళ్లతో సతమతమవుతున్నారు. పశ్చిమాసియాలో సంక్షోభం కారణంగా ఎగుమతులు 20-30 శాతం పడిపోయాయి.రవాణా ఖర్చులు పెరగడంతోపాటు కంటైనర్ల కొరత కూడా వేధిస్తోంది. మరోవైపు దేశంలో తీవ్రమైన వడగాడ్పులవల్ల పంట దిగుబడి తగ్గింది. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో జపాన్ నిషేధం వారిని మరింత కుంగదీసింది. 1986 నుంచి 2006 వరకు కూడా పండ్ల ఈగల కారణంగా జపాన్ భారత మామిడిపై నిషేధం విధించింది. వీహెచ్‌టీ ప్రక్రియను అమలు చేశాకే ఆ నిషేధాన్ని ఎత్తివేశారు. ప్రస్తుత సమస్యను పరిష్కరించేందుకు భారత ప్రభుత్వం జపాన్‌తో చర్చలు జరుపుతున్నప్పటికీ, ఈ సీజన్‌లో ఎగుమతులు తిరిగి ప్రారంభం కావడం కష్టమేనని నిపుణులు భావిస్తున్నారు.

# నన్ను విమర్శించినంత మాత్రాన మీ నేరాలు ఒప్పులైపోవు..

## ధర్మేంద్ర ప్రధాన్‌కు రాహుల్ గాంధీ కౌంటర్

**న్యూఢిల్లీ మే 28 మహాప్రభ**
సీబీఎస్ఈ ఓఎస్ఎం అంశంపై ప్రశ్నించినందుకు కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తనపై చేసిన విమర్శలకు కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ కౌంటర్ ఇచ్చారు. తనపై మాటల దాడి చేసినంత మాత్రాన ధర్మేంద్ర ప్రధాన్ చేసిన నేరాలు ఒప్పులైపోవని రాహుల్ గాంధీ విమర్శించారు. సోషల్ మీడియా వేదికగా రాహుల్ గాంధీ గురువారం స్పందించారు. ఇటీవల నీట్ పేపర్ లీక్ సహా, సీబీఎస్ఈ పరీక్షా ఫలితాల్లో జరిగిన అవకతవకలపై కూడా కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను రాహుల్ ప్రశ్నించారు.ఆయన రాజీనామా చేయాలని కూడా డిమాండ్ చేస్తున్నారు. పదేపదే రాహుల్ తనను టార్గెట్ చేసిన నేపథ్యంలో ధర్మేంద్ర ప్రధాన్ కూడా



రాహుల్‌పై గట్టిగా విమర్శలు గుప్పించారు. రాజకీయాలు తర్వాత చేయొచ్చని, విద్యార్థులపై ఒత్తిడి పెంచేలా ప్రకటనలు చేయవద్దని కోరారు. ఇప్పటికే విద్యార్థులు మార్కులు, వెరిఫికేషన్, రీవాల్యుయేషన్ వంటి అంశాల్లో ఆందోళనతో ఉంటే, వారిని ఇంకా మానసిక ఒత్తిడికి గురి చేసేలా చేయడం తగదని రాహుల్‌కు సూచించారు. రాహుల్ సర్‌ను, ఈవీఎంలను, డిజిటల్ ఇండియాను విమర్శించారని, వరుసగా ఎన్నికల్లో ఓడిపోతుండటంతో నిరాశతో రాహుల్ ఇలాంటి విమర్శలు చేస్తున్నారని మంత్రి అన్నారు. అయితే, దీనికి రాహుల్ ఘాటుగా స్పందించారు.ధర్మేంద్ర.. మీరు నాపై ఎలాగైనా దాడి చేయొచ్చు. నాపై దాడి చేసినంత మాత్రాన మీరు చేసిన నేరాలు ఒప్పులైపోవు. 18.5 లక్షల మంది చిన్నారులకు సమాధానం చెప్పాలి అని నేను ప్రశ్నించకుండా ఉండలేను. సీబీఎస్ఈ ఓఎస్ఎం కాంట్రాక్ట్‌ను గతంలో తప్పులు చేసిన సీఓఈఎంపీటీ సంస్థకు ఎందుకిచ్చారు..? ఈ సంస్థ చరిత్రను ఎందుకు తనిఖీ చేయలేదు. మోదీ ప్రభుత్వానికి. ఈ సంస్థకు ఉన్న సంబంధం ఏంటి" అని రాహుల్ ప్రశ్నించారు. నిజంగా ప్రధాని దీనికి బాధ్యత తీసుకుని ఉంటే మోదీ మిమ్మల్ని ఎప్పుడో మంత్రి పదవి నుంచి తప్పించేవారు అని రాహుల్ అన్నారు. మరోవైపు అంతకుముందు మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ మాట్లాడుతూ.. సీబీఎస్ఈ ఓఎస్ఎంలో జరిగిన తప్పులకు తనదే బాధ్యత అని ప్రకటించారు.

# ఢిల్లీలో మండుతున్న ఎండలు..

## - సోలార్ హట్స్ ఏర్పాటు చేయనున్న ప్రభుత్వం


**న్యూఢిల్లీ మే 28 మహాప్రభ**
దేశ రాజధాని ఢిల్లీలో ఎండలు మండుతున్నాయి. ఇతర ప్రాంతాలతో పోలిస్తే ఇక్కడ ఉష్ణోగ్రతలు ఎక్కువగా నమోదవుతున్నాయి. దీంతో ప్రజలు ఎండలకు తాళలేకపోతున్నారు. మరోవైపు ఎండలో బయటకు వస్తున్న ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో ఢిల్లీ ప్రజలకు ఎండ నుంచి రక్షణ కల్పించేందుకు కీలక నిర్ణయం తీసుకుంది. ఢిల్లీ నగరంలో సోలార్ హట్స్ ఏర్పాటు చేయాలని నిర్ణయించింది.స్థానిక షాలిమార్ బాగ్‌లో పైలట్ ప్రాజెక్ట్ కింద వీటిని ప్రయోగాత్మకంగా ఏర్పాటు చేయబోతున్నారు. దీని గురించి అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. చల్లదనాన్ని



అందించేందుకు వీటిని ఏర్పాటు చేస్తున్నారు. దీనికి అన్నివైపులా గడ్డిని ఏర్పాటు చేస్తారు. స్ప్రింక్లర్ సిస్టమ్ కూడా ఉండటం వల్ల లోపల అంతా చల్లదనాన్ని పరుచుకుంటుంది. ప్రజలకు దీనివల్ల నీడతోపాటు చల్లదనం లభిస్తుంది. ఇది సోలార్ శక్తి మీద నడుస్తుంది. ఈ హట్స్‌లో ప్రజలు ఎండ సమయంలో విశ్రాంతి తీసుకోవచ్చు. పౌరులు లోపల కూర్చోవడానికి సీటింగ్ ఏర్పాట్లు ఉంటాయి. అలాగే, చల్లటి మంచి నీరు అందుబాటులో ఉంటుంది. ఫోన్ ఛార్జింగ్ సౌకర్యం కూడా కల్పిస్తారు. ఈ హట్స్ పైన సోలార్ ప్యానెళ్లు ఏర్పాటు చేయడం వల్ల దీన్నుంచే విద్యుత్ సరఫరా జరుగుతుంది. ప్రస్తుతం ఈ హట్ నిర్మాణ దశలో ఉంది. రెండు, మూడు రోజుల్లో అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. దీన్ని సీఎం రేఖా గుప్తా ప్రారంభిస్తారు. ఢిల్లీ వ్యాప్తంగా మండుతున్న ఎండల నుంచి ఉపశమనం కలిగించేందుకు కూలింగ్ జోన్స్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ముఖ్యంగా కూలీలు, పాదచారులు, ప్రయాణికులకు దీనివల్ల ప్రయోజనం ఉంటుందని ప్రభుత్వ ఆలోచన. ప్రస్తుతం దీనికి ప్రజల నుంచి సానుకూల స్పందన వచ్చి, మంచి ఫలితం ఉంటే నగరవ్యాప్తంగా వీటిని ఏర్పాటు చేయాలని ప్రభుత్వ ఆలోచన.

# ఈ-20 పెట్రోల్‌తో తగ్గుతున్న మైలేజీ!

**న్యూఢిల్లీ, మే 28 మహాప్రభ**
: కేంద్రం ప్రవేశపెట్టిన ఈ-20 పెట్రోల్.. వాహనదారుల్లో గుబులు పుట్టిస్తున్నది. మొక్కజొన్న-చెరుకు రైతులను ప్రోత్సహించేందుకు ఈ ఇథనాల్ పెట్రోల్ ను తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. ఈ-20 పెట్రోల్‌తో 2022 అంతకంటే ముందు వాహనాలు కొన్నవారు ఇబ్బందులు పడుతున్నారు. ప్రతి



పదిమందిలో ఐదుగురు తమ వాహనం మైలేజీ తగ్గిపోయిందని, రిపేర్లు పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 2023 ముందు వాహనాల్లో అధికారులు చెబుతున్న దాని ప్రకారం 1 నుంచి 6 శాతం మైలేజీ పడిపోవాలి. కానీ ఓనర్లు మాత్రం గతం కంటే 20శాతం మైలేజీ పడిపోతున్నదని చెప్తున్నారు.

# ఎట్టకేలకు సిద్దరామయ్య రాజీనామా

(మొదటి తరువాయి)

డీకే శివకుమార్‌తో కలిసి ఆయన లోక్‌భవన్‌కు వెళ్లారు. అయితే, ఆ సమయంలో గవర్నర్ థావర్ చంద్ గహ్లోత్ అందుబాటులో లేకపోవడంతో ఆయన కార్యదర్శికి సిద్ధరామయ్య తన రాజీనామా లేఖను సమర్పించారు. ఈ విషయాన్ని గవర్నర్ ప్రత్యేక కార్యదర్శి సైతం ధ్రువీకరించారు. సీఎం రాజీనామా లేఖను తీసుకున్నామని, గవర్నర్ తిరిగొచ్చాక దీనిపై నిర్ణయం తీసుకుంటారని వెల్లడించారు. గహ్లోత్ ఈ సాయంత్రం బెంగళూరు చేరుకోనున్నారు. అనంతరం మంత్రులు డీకే శివకుమార్, పరమేశ్వరతో కలిసి సిద్ధరామయ్య మీడియాతో మాట్లాడారు. అధిష్ఠానం సూచనలతో సీఎం పదవికి రాజీనామా చేశా. హైకమాండ్ ఆదేశాలకు అందరం కట్టుబడి ఉంటాం. రాష్ట్ర ప్రయోజనాల కోసమే వైదొలిగా. నిబంధనల ప్రకారం ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేశా. దాన్ని గవర్నర్ ఆమోదిస్తారనే విశ్వాసం ఉంది. అసెంబ్లీలో కాంగ్రెస్‌కు సంపూర్ణ మెజార్టీ ఉంది. రాజ్యాంగబద్ధంగా కొత్త ప్రభుత్వం ఏర్పడుతుంది. ఇప్పటివరకు ప్రభుత్వ నిర్వహణలో నాకు సహకరించిన అందరికీ ధన్యవాదాలు. సీఎంగా నాకు అవకాశమిచ్చిన సోనియా, రాహుల్, ఖర్గేకు కృతజ్ఞతలు. 7 కోట్ల మంది కర్ణాటక ప్రజలకు సేవ చేసే అవకాశం లభించింది. రాజ్యాంగమే మా ధర్మం. ప్రజలే మాకు దేవుళ్లు అని సిద్ధరామయ్య తెలిపారు. జాతీయ రాజకీయాల్లోకి రావాలని హైకమాండ్ అడిగింది. రాజ్యసభ సీటు ఆఫర్ చేసింది. కానీ, నేను సున్నితంగా తిరస్కరించా. జాతీయ స్థాయి రాజకీయాలపై నాకు ఆసక్తి లేదు. అయితే, రాజకీయాల నుంచి వైదొలిగే ప్రసక్తే లేదు. ప్రజలు నన్ను 5 ఏళ్ల కాలానికి ఎన్నుకున్నారు. ఇంకా రెండేళ్లు మిగిలి ఉన్నాయి. అప్పటివరకు ఎమ్మెల్యేగానే కొనసాగుతానని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా తన రాజకీయ ప్రస్థానాన్ని, పదవీకాలాన్ని గుర్తుచేసుకుంటూ సిద్ధరామయ్య ఒకింత భావోద్వేగానికి గురయ్యారు. నేను పొరపాటున రాజకీయాల్లోకి వచ్చా. మా కుటుంబంలో అంతకుముందు ఎవరూ రాజకీయాల్లో లేరు. 2006లో కాంగ్రెస్‌లో చేరినప్పటి నుంచి హైకమాండ్ నన్ను ఆదరించింది. సీఎం అవుతానని కలలో కూడా అనుకోలేదు. అలాంటిది ముఖ్యమంత్రిగా, ప్రతిపక్ష నేతగా రెండేసిసార్లు సేవలందించాను. మ్యానిఫెస్టోలో ఇచ్చిన 160 హామీల్లో 158 నెరవేర్చా. మొదటి ఏడాదిలోనే ఐదు గ్యారెంటీలు అమలు చేశాం. నాపై ప్రతిపక్షాలు వదంతులు ప్రచారం చేశాయి. కానీ, నా రాజకీయ జీవితం తెరిచిన పుస్తకం. పదవి కోసం, డబ్బు కోసం ఏనాడూ పాకులాడలేదని సిద్ధరామయ్య వివరించారు. ఈ క్రమంలో అధిష్టానంతో భేటీకి సిద్ధరామయ్య ఢిల్లీ వెళ్లనున్నట్లు సమాచారం. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీతో భేటీ కానున్నారు. కర్ణాటక కాంగ్రెస్ ఎమ్మెల్యేల సమావేశానికి సంబంధించి నిర్ణయం తీసుకోనున్నట్లు సమాచారం. సిద్ధరామయ్య స్థానంలో రాష్ట్ర నూతన ముఖ్యమంత్రిగా డీకే శివకుమార్ బాధ్యతలు చేపట్టడం దాదాపు ఖాయంగానే కనిపిస్తోంది. శనివారం జరిగే సీఎల్పీ సమావేశంలో కొత్త శాసనసభాపక్ష నేతను ఎన్నుకునే అవకాశం ఉంది. ప్రమాణస్వీకార కార్యక్రమంపై అధికారిక ప్రకటన ఇంకా వెలువడలేదు.

# రాబోయే ఐదేండ్లూ భగభగలే..

(మొదటి తరువాయి)

ఒకవేళ సగటు ఉష్ణోగ్రతలు 1.5 డిగ్రీలు దాటితే తీవ్రమైన వాతావరణ మార్పులు, అకాల వర్షాలు, వరదలు, కరువు, సముద్ర మట్టాలు పెరగడానికి దారితీస్తుంది. డబ్ల్యూఎంవో తాజా నివేదిక ప్రకారం, రాబోయే ఐదేండ్లలో ప్రపంచ సగటు ఉష్ణోగ్రతలు రికార్డ్‌స్థాయిలో లేదా దానికి సమీపంలో ఉండే అవకాశముంది. 2026 నుండి 2030 వరకు అంచనా వేసిన భూ ఉపరితల ఉష్ణోగ్రతలు 1850–1900 (పారిశ్రామిక విప్లవానికి ముందు) సగటు కంటే 1.3 నుండి 1.9 డిగ్రీల సెల్సియస్ ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. 2024 అత్యంత వేడి సంవత్సరంగా రికార్డ్ నెలకొల్పింది. సగటు ఉష్ణోగ్రతల్లో పెరుగుదల 1.55 డిగ్రీల సెల్సియస్‌కు చేరుకుంది. తాజా అంచనాల ప్రకారం రాబోయే ఐదేండ్లలో 1.5 డిగ్రీల సెల్సియస్ పరిమితిని దాటే అవకాశం చాలా ఎక్కువగా ఉంది. 2026–30 మధ్య ఏదో ఒక సంవత్సరం అత్యంత వేడి సంవత్సరంగా 2024ను అధిగమించే అవకాశం 86 శాతం ఉంది.

## దేశంలోనే ధనిక ప్రాంతీయ పార్టీగా టీడీపీ..

(మొదటి తరువాయి)

బిజూ జనతాదళ్ (బీజేడీ), 227.59 కోట్లతో టీఎంసీ మూడో స్థానంలో నిలిచాయి. దేశంలోని మొత్తం 36 ప్రాంతీయ పార్టీల ఆదాయం అంతకు మందు ఏడాదితో పోలిస్తే 2024–25లో 51 శాతం వరకు తగ్గిపోయింది. అలాగే 21 పార్టీల ఖర్చు తమ ఆదాయం కన్నా ఎక్కువగా చూపినట్టు ఈ నివేదిక తెలిపింది. దేశంలో గుర్తింపు పొందిన ప్రాంతీయ పార్టీలు 67 ఉండగా, అందులో 2024–25 ఆర్థిక సంవత్సరానికి 36 పార్టీలు మాత్రమే ఆడిట్ రిపోర్టులు పంపాయని, వాటి ఆధారంగానే ఈ నివేదిక తయారు చేసినట్టు సంస్థ వెల్లడించింది. టీఎంసీకి రూ.184.08 కోట్లు, వైఎస్‌ఆర్ పార్టీకి 140.05 కోట్లు, టీడీపీకి 85.20 కోట్లు విరాళంగా వచ్చాయి. ఈ నివేదిక తయారు చేసేటప్పటికి డీఎంకే, శివసేన, శివసేన (యూబీటీ), ఎన్సీపీ, జమ్ముకశ్మీర్ నేషనల్ కాన్ఫరెన్స్ పార్టీలు 2024–25 ఆర్థిక సంవత్సరానికి తమ ఆడిట్ నివేదికలు సమర్పించ లేదు. 2024–25లో ప్రాంతీయ పార్టీలన్నింటిలో అగ్రశ్రేణి ఐదు ప్రాంతీయ పార్టీలు మొత్తం ఆదాయంలో దాదాపు 69 శాతాన్ని కలిగి ఉన్నాయి.

# హర్మ్యూజ్ జలసంధి ఎవరి సొత్తు కాదు

(మొదటి తరువాయి)

అవసరమైతే రక్షణ మంత్రిని రంగంలోకి దించి పని పూర్తిచేస్తామంటూ హెచ్చరించారు. అమెరికాలో మధ్యంతర ఎన్నికలు ఉన్నాయని ఇరాన్ భావిస్తోందని, కానీ తాను ఎన్నికలను పట్టించుకోనని ట్రంప్ వ్యాఖ్యానించారు. "ఇరాన్ అణ్వాయుధాలు సంపాదించకూడదు. అది కేవలం అమెరికా కోసమే కాదు. ప్రపంచ భద్రత కోసం చేస్తున్న పని అని ట్రంప్ స్పష్టం చేశారు. ఇరాన్ నాయకత్వం అమెరికాతో ఒప్పందం చేసుకోవాలని కోరుకుంటోందని, కానీ ఇప్పటివరకు సరైన పురోగతి కనిపించలేదన్నారు. "ఇప్పటివరకు మేము సంతృప్తిగా లేం. కానీ చివరికి అవుతాం" అని ఆయన వ్యాఖ్యానించారు. హర్మ్యూజ్ జలసంధిపై కూడా ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ ప్రాంతం అంతర్జాతీయ జలమార్గమని, దీనిని ఏ దేశం నియంత్రించలేదని అన్నారు. "హర్మ్యూజ్ అందరికీ తెరిచి ఉంటుంది. మేము పర్యవేక్షిస్తాం కానీ దానిపై ఎవరికీ పూర్తి నియంత్రణ ఉండదు" అని తెలిపారు. ఇదే అంశం ప్రస్తుతం జరుగుతున్న చర్చల్లో భాగమని వెల్లడించారు. అంతేకాదు ఒమన్‌కు కూడా ట్రంప్ హెచ్చరికలు జారీ చేశారు. హర్మ్యూజ్ చర్చల్లో ఒమన్ జోక్యం చేసుకుంటే తీవ్ర పరిణామాలు ఉంటాయని అన్నారు. "ప్రపంచంలోని మిగతా దేశాల్లాగే ఒమన్ కూడా ప్రవర్తించాలి. లేకపోతే మేం చర్యలు తీసుకోవాల్సి వస్తుంది" అని ఘాటుగా స్పందించారు. ఇదిలా ఉంటే, ఇరాన్ ప్రభుత్వ మీడియా ఓ సంచలన కథనాన్ని ప్రసారం చేసింది. అమెరికా, ఇరాన్ మధ్య తాత్కాలిక అవగాహన ఒప్పందం కుదిరిందని, యుద్ధ పరిస్థితులను తగ్గించే దిశగా రెండు దేశాలు ముందడుగు వేసాయని పేర్కొంది. ఈ ఒప్పందం ప్రకారం అమెరికా తన నౌకాదళ దిగ్బంధాన్ని ఎత్తివేయాలని, గల్ఫ్ ప్రాంతం నుంచి సైనిక బలగాలను వెనక్కి తీసుకోవాలని కథనంలో పేర్కొన్నారు. అలాగే హర్మ్యూజ్ జలసంధిలో వాణిజ్య నౌకల రాకపోకలు 30 రోజుల్లో సాధారణ స్థితికి చేరుకుంటాయని ఇరాన్ మీడియా వెల్లడించింది. ఈ ప్రాంతంలో వాణిజ్య నౌకల పర్యవేక్షణను ఇరాన్, ఒమన్ సమన్వయంతో నిర్వహిస్తాయని కూడా పేర్కొంది. అయితే ఈ వార్తలను అమెరికా వైట్ హౌస్ పూర్తిగా ఖండించింది. "ఇరాన్ ప్రభుత్వ నియంత్రణలో ఉన్న మీడియా ప్రచారం చేస్తున్న కథనాలు పూర్తిగా అబద్ధాలు. వారు విడుదల చేశామంటున్న అవగాహన ఒప్పందం పూర్తిగా కల్పితం అని వైట్ హౌస్ ఎక్స్ వేదికగా ప్రకటించింది. ఇరాన్ మీడియా కథనాలను ఎవరూ నమ్మవద్దని స్పష్టం చేసింది. మరోవైపు అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో కూడా ఈ అంశంపై స్పందించారు. అమెరికా ఇప్పటికీ దౌత్య మార్గానికే ప్రాధాన్యం ఇస్తోందని చెప్పారు. "దౌత్య చర్చలే ఎప్పుడూ మొదటి ఎంపిక. ఒప్పందం కుదిరే అవకాశం ఉంటే మేము సిద్ధంగా ఉన్నాం" అని అన్నారు. ఇటీవల కొన్ని చర్చల్లో పురోగతి కనిపించిందని, రాబోయే గంటలు, రోజుల్లో పరిస్థితి మరింత స్పష్టమవుతుందని తెలిపారు.

# తెలుగు జాతి గర్వించదగ్గ మహానేత ఎన్టీఆర్

(మొదటి తరువాయి)

గాంధీ పి.వి. నరసింహారావు వంటి నాయకులను అందిస్తే, తెలుగు రాష్ట్రాల్లో ఎన్టీఆర్ కూడా అదే స్థాయిలో సమర్థవంతమైన నాయకత్వాన్ని తయారు చేశారని కొనియాడారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన ప్రసంగంలో మాజీ సీఎం కేసీఆర్‌పై నేరుగా విమర్శనాస్త్రాలు సంధించారు. నాడు ఎన్టీఆర్ లేకుంటే కేసీఆర్ గానీ, లేదా ఇతర నేతలు గానీ ఈ స్థాయికి వచ్చేవాళ్లా? అని ప్రశ్నించారు. కేసీఆర్‌కు రాజకీయ భిక్ష పెట్టింది ఎన్టీ రామారావు అని, ఆయన నీడన బతికి ఈరోజు ఆయన గురించే తక్కువ చేసి మాట్లాడటం సరికాదని హితవు పలికారు. ఎన్టీఆర్ పేరు చెప్పుకుని రాజకీయం చేస్తూ, ఆయన విగ్రహాల ఏర్పాటును వ్యతిరేకించడం లేదా తక్కువ చేయడం వారి నకిలీ ఆలోచనలకు నిదర్శనమని రేవంత్ ఎద్దేవా చేశారు. సంక్షేమ పథకాల విషయంలో ఎన్టీఆర్ దార్శనికతను రేవంత్ రెడ్డి ఆకాశానికెత్తారు. ఆనాడు ఎన్టీఆర్ ప్రారంభించిన పక్కా ఇళ్ల పథకమే నేటి ఇందిరమ్మ ఇళ్ల పథకానికి పునాది అని ఆయన గర్వంగా ప్రకటించారు. పేదలకు గూడు కల్పించాలనే ఎన్టీఆర్ సంకల్పాన్ని తమ ప్రభుత్వం ముందుకు తీసుకెళ్తోందని చెప్పారు. తుమ్మల నాగేశ్వరరావు, మండవ వెంకటేశ్వరరావు వంటి నేతలను రాజకీయాలకు పరిచయం చేసిన ఘనత ఎన్టీఆర్‌దేనని, ఆ వారసత్వాన్ని తాము గౌరవిస్తామని తెలిపారు. కాంగ్రెస్ వేదికలపై ఎన్టీఆర్ నామాన్ని జపించడంపై వస్తున్న రాజకీయ



విమర్శలను రేవంత్ రెడ్డి కొట్టిపారేశారు. రాజకీయాలకు అతీతంగా ఎన్టీఆర్ ఒక వ్యవస్థ అని, ఆయన విగ్రహం అమీర్‌పేట వంటి ప్రాంతంలో ఉండటం తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీక అని పేర్కొన్నారు. హైదరాబాద్ అభివృద్ధిలో ఎన్టీఆర్ వేసిన పునాదులను ఎవరూ విస్మరించలేరని, అలాంటి మహానుభావుడికి నివాళి అర్పించడం తన అదృష్టంగా భావిస్తున్నానని చెప్పారు. మైత్రివనం వద్ద జరిగిన ఈ విగ్రహావిష్కరణ కార్యక్రమం కేవలం ఒక విగ్రహావిష్కరణలా కాకుండా, రేవంత్ రెడ్డి రాజకీయ చాణక్యానికి వేదికగా మారింది. ఒకవైపు ఎన్టీఆర్ అభిమానులను ఆకట్టుకుంటూనే, మరోవైపు కేసీఆర్ , బీఆర్‌ఎస్ వైఖరిని ఎండగట్టడంలో రేవంత్ సక్సెస్ అయ్యారు. ఈ పరిణామం తెలుగుదేశం సానుభూతిపరులను కూడా కాంగ్రెస్ వైపు ఆలోచింపజేసేలా ఉందని భావిస్తున్నారు. వ్యవసాయాన్ని పండుగ చేయటమే లక్ష్యంగా పరిపాలన చేస్తున్నాం. స్థానిక సంస్థల్లో మహిళలకు రిజర్వేషన్లు ఇవ్వాలనే రాజీవ్‌గాంధీ నిర్ణయాన్ని ఎన్టీఆర్ అమలు చేశారు. వచ్చే ఎన్నికల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు ఇస్తాం. ఇందిరమ్మ ఇళ్లలో ఉన్న నిరుపేదలకు టికెట్లు ఇచ్చి ఎమ్మెల్యేలను చేశాం. ఎన్టీఆర్ స్ఫూర్తితోనే ఇందిరమ్మ ఇళ్లు, మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్నామని అన్నారు. టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్? మాట్లాడుతూ, ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటు చేస్తామని మాట ఇచ్చామని, నిలబెట్టుకున్నామని తెలిపారు. మాట ఇస్తే కాంగ్రెస్ నిలబెట్టుకుందనడానికి ఇదే నిదర్శనని వెల్లడించారు. ఎన్టీఆర్‌ను ఒక ప్రాంతానికో, వర్గానికో పరిమితం చేయడం సరికాదని సూచించారు. పేదల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన వ్యక్తి ఎన్టీఆర్ అని కొనియాడారు. ఇందిరాగాంధీ, ఎన్టీఆర్ పాలన మాదిరే రేవంత్‌రెడ్డి పరిపాలిస్తున్నారని అన్నారు. రేవంత్ రెడ్డి నేతృత్వంలో పేదలకు సంక్షేమ కార్యక్రమాలు అందుతున్నాయని తెలిపారు. జాతి గర్వించదగిన వ్యక్తి ఎన్టీఆర్ అని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కొనియాడారు. ఎన్టీఆర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలనేది జూబ్లీహిల్స్ ప్రజల కోరిక అని అన్నారు. తెలుగువాడి గుండెల్లో చిరస్థాయిగా నిలబడిన వ్యక్తి ఎన్టీఆర్ అని, రేవంత్ రెడ్డి ప్రజారంజక పాలన కొనసాగిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమానికి పలువురు ఎన్టీఆర్ కుటుంబసభ్యులు కూడా హాజరయ్యారు.

# తెలంగాణకు చల్లని కబురు

## రెండురోజుల్లో రుతుపవనాల ఆగమనం



హైదరాబాద్,
:తీవ్రమైన ఎండలు, ఉక్కపోతతో అల్లాడిపోతున్న తెలంగాణ ప్రజలకు వాతావరణ శాఖ ఓ చల్లని కబురు అందించింది. ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న నైరుతి రుతుపవనాలు చురుగ్గా కదులుతూ రెండు రోజుల్లో రాష్ట్రంలోకి ప్రవేశించనున్నాయని వెల్లడించింది. ఈ రుతుపవనాల ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా వాతావరణం ఒక్కసారిగా చల్లబడటమే కాకుండా, రాగల మూడు రోజుల పాటు విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. రుతుపవనాలు రాష్ట్రవ్యాప్తంగా పూర్తిగా విస్తరించడానికి ముందు రాబోయే రెండు రోజుల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశముందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఉత్తర, తూర్పు తెలంగాణ జిల్లాల్లో వడగాలుల తీవ్రత ఎక్కువగా ఉంటుందని, పగటిపూట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే మరింత ఎక్కువయ్యే ప్రమాదం ఉందని పేర్కొంది. అందువల్ల రుతుపవనాలు పూర్తిగా ప్రవేశించే వరకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఎండ తీవ్రత దృష్ట్యా మధ్యాహ్నం వేళల్లో తగు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచించారు.

# 20 లక్షల ఇండ్లు కట్టిస్తేనే ఓట్లడగాలి

(మొదటి తరువాయి)

ఇచ్చిన ప్రతి వాగ్దానాన్ని అమలు చేస్తామని ప్రతినబూనాలని సవాల్ విసిరారు. తాము కట్టిన ఒక్కో డబుల్ డెద్రూంకు ఏడు ఇందిరమ్మ ఇండ్లతో సమానమని పేర్కొన్నారు. వారికి చిత్తశుద్ధి, సత్తా ఉంటే తాము కట్టిన వాటికి మించి హైదరాబాద్‌లో డబుల్ బెద్రూం ఇండ్లు కట్టాలని డిమాండ్ చేశారు. తాము ఇండ్లు కడితే, కాంగ్రెస్ ప్రభుత్వం కూలగొడుతున్నదని విమర్శిం చారు. గత రెండున్నర ఏండ్లలో హైదరాబాద్ నగరంలో కట్టిన ఇండ్లు ఎన్ని? పడగొట్టిన ఇండ్లు ఎన్ని? అనే దానిపై శ్వేతపత్రం ప్రకటించే ధైర్యం ఉందా?అని ప్రశ్నించారు. దీపావళికి బాంబులు పేలుస్తామని చెప్పి తుస్సు మనిపించిన 'తుపేల్ మినిస్టర్', 'మిస్టర్ బాంబులేటి' అని ఎద్దేవా చేశారు. పొంగులేటి మాదిరి కోహినూరు హోటల్లో కాళ్లు పట్టుకుని, ఢిల్లీకి లొంగిపోయి కేసుల నుంచి తప్పించుకునే ఉపాయం తమకు తెలియదని పేర్కొన్నారు. రెవెన్యూ శాఖను అడ్డుపెట్టుకుని భూభారతిలో బ్లాక్ లిస్టులు, బ్లాక్ మెయిల్ దందాలు చేసి దండుకునే ల్యాండ్ గేమ్స్, గూండాలను ఉసిగొల్పి సామాన్యులపై దౌర్జన్యాలు చేసి భూములను బుక్క పట్టడం తమకు తెలియని తెలిపారు. అడ్డదారుల్లో కొడుకు కంపెనీకి రూ.వేల కోట్ల కాంట్రాక్టులు ఇప్పించుకునే అవినీతి కిటుకులు, అక్రమ క్రషర్లు నడుపుతూ అడ్డగోలుగా ప్రభుత్వ సొమ్మును కొల్లగొట్టే చిట్కాలు తమకు తెలియవని పేర్కొన్నారు. బడుగు బలహీన వర్గాల నేతల మీద అహంకారంతో పేపర్లు విసిరికొట్టడం కూడా తమకు తెలియదని వివరించారు. బీఆర్‌ఎస్ హయాంలో ఆత్మగౌరవ గృహాలు కట్టామని గుర్తు చేశారు. హైదరాబాద్ మహా నగరంలో ఏకంగా లక్ష డబుల్ బెద్రూం ఇండ్లను నిర్మించిన ఘనత తమదేనని తెలిపారు. ప్రభుత్వం ఎన్ని పనికిమాలిన ప్రగల్భాలు పలికినా, ఎన్ని డైవర్షన్ డ్రామాలు ఆడినా 420 హామీల ఎన్నికల మోసాన్ని ఎండగట్టకుండా వదిలిపెట్టబోమని స్పష్టం చేశారు. ఆరు గ్యారెంటీలు, 13 డిక్లరేషన్ల ఎగవేత ద్రోహాన్ని ప్రశ్నించకుండా విడిచిపెట్టబోమని ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

## ఉక్రెయిన్‌తో ఎడతెగని

# రష్యా యుద్ధం

(మొదటి తరువాయి)

జెలెన్‌స్కీ ఈ ఫిబ్రవరిలో వెల్లడించారు. ఇరువైపులా ప్రాణనష్టం భారీగానే ఉన్నా.. రెండు దేశాలు వాస్తవ లెక్కలను వెల్లడించట్లేదనే ఆరోపణలున్నాయి. గత నాలుగేళ్లుగా డాన్‌బాస్ ప్రాంతంలోని ఉక్రెయిన్ స్థావరాలపై దాడుల కోసం రష్యా తన సైనికులను దశలవారీగా మోహరించింది. కొత్తగా చేరిన సైనికులు, జైళ్ల నుంచి నియమించుకున్నవారు ఈ ఘర్షణల్లో పాల్గొన్నారు. వారికి సరైన శిక్షణ లేకపోవడం.. యుద్ధరంగంలో భారీగా ప్రాణనష్టానికి దారితీస్తున్నట్లు కనిపిస్తోంది. మరోవైపు, అమెరికా, దాని మిత్రదేశాలు సరఫరా చేసే క్షిపణి వ్యవస్థలు, ఫిరంగి, అధునాతన డ్రోన్లను ఉక్రెయిన్ ఉపయోగిస్తోంది. కమాండ్ పోస్టులు, సైనిక సమూహాలు లక్ష్యంగా జెలెన్‌స్కీ సైన్యం దాడులు చేస్తోంది. దాంతో ఈ నష్టం మరింత పెరిగిందనే అంచనాలున్నాయి. ఈ దాడులను ఎదుర్కొనేలా రష్యా సుశిక్షితులైన సైనికులను నియమించుకోలేక పోతుందని, విధుల్లో ఉన్నవారిని కాపాడుకునేలా ఎలాంటి రక్షణకవచాలను సమీకరించలేకపోతుందని యూకే నిఘా వర్గాలు అంచనా వేశాయి. ఈ కారణాలే రష్యాను దెబ్బతీస్తున్నట్లు విశ్లేషణలు వినిపిస్తున్నాయి. ఇదిలా ఉంటే.. ఆర్మీలో యువతను చేర్చుకునేందుకు రష్యా ప్రభుత్వం వారికి పెద్ద ఎత్తున ప్రోత్సాహకాలు ప్రకటిస్తోంది. ఇందులో భాగంగా రక్షణశాఖతో ఒప్పందం కుదుర్చుకునే వారికి, వారి కుటుంబాలకు ఉండే రుణాల్లో 10 మిలియన్ రూబుల్స్ (సుమారు రూ.1.33కోట్లు) వరకు మాఫీ చేస్తామని హామీ ఇచ్చింది. కొత్తగా సైన్యంలో చేరాలనుకునే వారు కనీసం ఏడాది పాటు కొనసాగుతానని హామీ ఇవ్వాల్సి ఉంటుందని, ఇందుకు సంబంధించిన నిర్ణయంపై అధ్యక్షుడు పుతిన్ సంతకం చేసినట్లు వార్తలు వచ్చాయి.

# చంద్రుడిపై మానవుల నగరం..

(మొదటి తరువాయి)

ఎలా ఉంటుంది..?
ఈ నగరాన్ని భూమి మీద నుంచి తీసుకెళ్లే మడతపెట్టగల వసువులతో తయారు చేస్తారు. చంద్రుడి దక్షిణ ధృవంకు దగ్గర్లోనే ఈ నగరాన్ని నిర్మించబోతున్నారు. ఎందుకంటే అక్కడ నీటి నిక్షేపాలు ఉన్నాయి. ఈ నగరం భూమిమీద ఉన్న ఇండ్ల మాదిరిగా ఉండబోతున్నది. అలాగే కఠినమైన పరిస్థితులను తట్టుకునేలా దీన్ని డిజైన్ చేస్తారు. నాసా అడ్మినిస్ట్రేటర్ జేరెడ్ ఇసాక్‌మాన్ మాట్లాడుతూ.. ఈ ఏడాది చివర్లో చంద్రుడిపైకి సైంటిఫిక్ వస్తువులను పంపుతామన్నారు. వాటి ద్వారా ఎక్కడ నగరం నిర్మాణానికి అనువుగా ఉంటుందో సెర్చ్ చేసి.. వచ్చే సంవత్సరం నుంచి నిర్మాణ పనులు మొదలు పెడుతామన్నారు. దీంతో నాసా చేపట్టే ఈ నగరం గురించి పెద్ద ఎత్తున చర్చ జరుగుతున్నది.

# దేశానికి ఆదర్శంగా ఫ్యూచర్ సిటీ

(మొదటి తరువాయి)

. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఫ్యూచర్ సిటీని అత్యాధునిక సౌకర్యాలతో అభివృద్ధి చేస్తోందన్నారు. విద్య, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాల కల్పనకు కేంద్రంగా స్కిల్ యూనివర్సిటీ నిలవబోతోందని చెప్పారు. ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ కార్యాలయం ద్వారా నగర అభివృద్ధి పనులకు మరింత వేగం చేకూరుతుందని పేర్కొన్నారు. నిర్మాణ పనులను నాణ్యతతో, నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఫ్యూచర్ సిటీ అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి సారించిందని మంత్రులు శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. స్కిల్ యూనివర్సిటీ శాశ్వత క్యాంపస్ పనులను తనిఖీ చేశారు. క్షేత్రస్థాయిలో పనుల పురోగతిని సమీక్షించారు. నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని అధికారులకు మంత్రులు ఆదేశాలు జారీ చేశారు. ఎఫ్‌సీడీఏ కార్యాలయం, స్కిల్ యూనివర్సిటీ పనులపై మార్గనిర్దేశర చేశారు. నిర్దేశిత గడువులో పనులు పూర్తి చేయాలని సూచించారు. ఆధునిక మౌలిక వసతులతో ఫ్యూచర్ సిటీ రూపుదిద్దుకుంటోందని తెలిపారు. ఫ్యూచర్ సిటీ దేశానికి తలమానికంగా నిలవడం ఖాయమని మంత్రులు స్పష్టం చేశారు.

# ప్రతి పౌరుడికి సమగ్ర సంక్షేమ కార్డు..

(మొదటి తరువాయి)

సీఎస్ రామకృష్ణారావు, సీఎం స్పెషల్ సెక్రటరీ బి.అజిత్ రెడ్డి, ఐటీ శాఖ జాయింట్ సెక్రటరీ అనుదీప్ దురిశెట్టి తదితర ఉన్నతాధికారుల సమీక్షలో సీఎం ఈ విషయాన్ని ప్రత్యేకంగా చర్చించారు. సమగ్ర సంక్షేమ కార్డ్ ద్వారా రాష్ట్రంలోని ప్రతి పౌరుడి పూర్తి సంక్షేమ ప్రొఫైల్ ఒకేచోట అందుబాటులోకి వస్తుందని ముఖ్యమంత్రి అన్నారు. ఈ డేటాను అన్ని కోణాల్లో ఏఐ సహాయంతో విశ్లేషిస్తే సంక్షేమ పథకాల అమలులో పారదర్శకత పెరుగుతుందన్నారు. నిజమైన అర్హులకు పథకాలు మరింత ఖచ్చితంగా చేరుతాయన్నారు. అదే సమయంలో అనర్హులను గుర్తించడం సులభమవుతుందని అభిప్రాయపడ్డారు. ప్రతి శాఖ వేర్వేరుగా కార్డులు ఇచ్చే పద్ధతికి బదులు, ఐటీ శాఖ ఆధ్వర్యంలో సమగ్ర సంక్షేమ కార్డ్ ఉండాలని సీఎం సూచించారు. టెక్నాలజీపై పట్టున్న, చురుగ్గా పనిచేసే యువ ప్రభుత్వ అధికారులను ఈ ప్రక్రియకు వినియోగించాలని చెప్పారు. ఈ కార్డ్‌లో ఆరోగ్యశ్రీ, ముఖ్యమంత్రి సహాయ నిధి, ఫీజు రీయింబర్స్‌మెంట్, కార్మిక శాఖ, విద్యా శాఖ, ఇన్సూరెన్స్ పథకాలు, ప్రభుత్వం తీసుకువస్తున్న బీమా పథకాల వివరాలు ఉండాలని చెప్పారు. అవసరమైతే ఆధార్ నంబర్ తరహాలో రాష్ట్ర స్థాయిలో ప్రత్యేక యూనిక్ ఐడెంటిటీ నంబర్ ఇచ్చేలా ఆలోచించాలన్నారు. ఇటీవల ప్రభుత్వం నిర్వహించిన సమగ్ర సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే వివరాలను కూడా ఈ కార్డ్‌కు అనుసంధానించాలన్నారు.
లబ్ధిదారుల వివరాలతో పాటు వివిధ శాఖల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంఖ్య, ఇతర వివరాలను సేకరించాలని ఐటీ శాఖను ఆదేశించారు. ఏఐ ఆధారిత ప్రొఫైలింగ్ ఉండాలని సీఎం సూచించారు ఎక్కడైనా మరణ ధృవీకరణ పత్రం జారీ అయితే, ఆ సమాచారం చేయూత పెన్షన్ డేటాబేస్‌కు చేరాలని, వెంటనే దాని ఆధారంగా చర్యలు మొదలయ్యేలా ఉండాలన్నారు. ప్రజల ఆరోగ్య ప్రొఫైల్‌ను కూడా సమగ్ర సంక్షేమ కార్డ్ తో లింక్ చేయాలని చెప్పారు. కేరళ నుంచి గల్ఫ్‌కు వలస వెళ్లే ఉద్యోగులకు అనుసరిస్తున్న విధానాలను అధ్యయనం చేయాలని సూచించారు. నైపుణ్యాభివృద్ధి, శిక్షణ కార్యక్రమాలతో పాటు, పాస్‌పోర్టులు, వీసాల జారీకి సంబంధించిన సమాచారం ఒకేచోట అందుబాటులో ఉంచితే, అనధికార ఏజెంట్ల ప్రమేయం తగ్గుతుందని తెలిపారు. పేదలకు సంక్షేమ ఫలాలు ఖచ్చితంగా చేరేలా, ప్రభుత్వం అమలు చేసే ప్రతి పథకం ప్రభావాన్ని అంచనా వేసేలా సమగ్ర సంక్షేమ కార్డ్ ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

## సంపాదకీయం

# ఈడి-మోడీ మిలాఖత్!



రాజు తలచుకుంటే దెబ్బలకు కొదవా" అన్నట్లు, బీజేపీ అనుకోవాలేగానీ ఏదైనా చేస్తుందన్నది పాతపడిన విద్యే. ఎన్ఐఏ, ఈడి, ఐటి, సిబిఐ వంటి సంస్థలను ఎగదోసి వ్యతిరేకించే ప్రతిపక్ష నేతల నివాసాలపై దాడులు చేయిస్తుంది. అరెస్టులు చేసి జైల్లో పెడుతుంది. మీడియా, సంస్థల్ని కూడా ఇదే తీరుగా బెదిరింపులకు గురిచేస్తుంది. కేరళం తాజా మాజీ ముఖ్యమంత్రి, సీపీఐ(ఎం) అగ్రనేత పినరయి విజయన్ ఇంటితోపాటు కుటుంబ సభ్యుల నివాసాలపై బుధ వారం నాడు పన్నెండు చోట్ల ఈడి సోదాలు చేసింది. అదేమి పట్టుకుందో, ఏం వెలికితీసిందో తెలియదు. కానీ, ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ నాయకత్వంలోని యుడిఎఫ్ కూటమి విజయన్ ప్రభుత్వంపై చేయని ఆరోపణ లేదు. ఎంతగా దిగజారిందంటే 'ఆయన్ను ఎందుకు అరెస్టు చేయటం లేదు?' స్వయంగా రాహుల్‌గాంధీ ప్రశ్నించటాన్ని కేరళం పౌరులు చూశారు. బీజేపీతో సీపీఐ(ఎం) కుమ్మక్కు అయినందునే ఆ పని చేయలేదని దుష్ప్రచారం చేశారు. ఒక కల్లుగీత కార్మిక కుటుంబంలో పుట్టిన విజయన్ పోరాట వీరుడు, మచ్చలేని నేత. కన్నూరు జిల్లాలో శ్రామికుల తరఫున కమ్యూనిస్టులు నిర్వహించిన మహత్తర పాత్ర యావత్ ప్రపంచానికి తెలుసు. యువకుడిగా కష్టజీవుల కోసం నిలిచిన నాటి నుంచి విజయన్‌పై జరగని దాడి లేదు.అనేక సార్లు ప్రాణాలు తీసేం దుకు చూసిన శక్తులు ఇప్పుడు పరువు తీసేందుకు ఈ దాడి చేయించాయని వేరే చెప్పనవసరం లేదు. కన్నూరు ప్రాంతంలో ఒక వైపు కాంగ్రెస్, మరోవైపు ఆరెస్సెస్ మూకలు నిత్యం కమ్యూనిస్టులను అణచివేసేందుకు చేసిన యత్నాలను స్వయంగా ఎదుర్కొన్ననేత విజయన్, బీజేపీతో చేతులు కలుపుతారా? సూర్యుడి మీద ఉమ్మివేస్తే వేసినవారి మీదే పడుతుంది. గతంలో మంత్రిగా చేసినపుడు విజయన్ మీద కాంగ్రెస్ నేతలు చేసిన ఆరోపణలు ఒక్కటీ రుజువు కాలేదు. పోరుబాటలో మడమ తిప్పకుండా ముందుకు పోతున్న విజయన్‌కు కేసులు కొత్తకాదు, ఈ దాడులతో ఆయన ప్రతిష్ట మసకబారేదీ లేదు. జర్మన్ గోబెల్స్ మాదిరి కాంగ్రెస్ నేతల దిగజారుడు ప్రచారం, బీజేపీ ఆచరణ వెనుక పెద్ద కుట్రేదాగి ఉందని ఇప్పుడు ఈ సోదాలు తేటతెల్లం చేశాయి. నిజంగా బీజేపీతో చేతులు కలిపి ఉంటే ఈడి దాడులు జరిగేవా? బుర్రలో గుజ్జున్న ప్రతి ఒక్కరూ నేడు ఆలోచిస్తున్నారు. దేశంలో, వివిధ రాష్ట్రాల్లో కాంగ్రెస్ అవకాశవాద, దిగజారుడు రాజకీయాల గురించి చెప్పనవసరం లేద. మద్యం కుంభకోణం పేరుతో తప్పుడు కేసు పెట్టి ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రివాల్, మంత్రులను నెలల తరబడి జైల్లో పెట్టినపుడు బీజేపీ ఆరోపణలకు కాంగ్రెస్ వంతపాడింది. అలాంటి పార్టీ కేరళంలో తమకు రాజకీయ ప్రత్యర్థిగా ఉన్న సీపీఐ(ఎం) నేతలపై తప్పుడు ఆరోపణలు చేయటంలో ఆశ్చర్యం లేదు. ఇలాంటి పార్టీ ఇండియా కూటమిలో పెద్ద పక్షంగా ఉండి బీజేపీకి పరోక్షంగా సాయం చేయటం తప్ప ఆ కూటమిని ముందుకు తీసుకుపోతుందా! విజయన్‌పై దాడిని ఎంకె స్టాలిన్, కేజ్రివాల్, తేజస్వీ యాదవ్, డి.రాజా వంటి ఎందరో ఖండించారు. ఈడి మీద దాడికి పాల్పడ్డారనే పేరుతో మూడు వందల మంది సీపీఐ(ఎం) కార్యకర్తలు, అభిమానుల మీద కేరళం కాంగ్రెస్ ప్రభుత్వం కేసులు పెట్టి అనేక మందిని అరెస్టులు చేసింది. అయినప్పటికీ కార్యకర్తలు రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు తెలిపారు. ఈడి దాడులతో కేరళం నివ్వెరపోయింది. అసలు ఆ సంస్థ ముందుగా తమకు ఎలాంటి సమాచారం ఇవ్వలేదని రాష్ట్ర డిజిపి చెప్పటం రాష్ట్ర ప్రభుత్వాన్ని కాపాడే నాటకం తప్ప మరొకటి కాదు. అదే గనుక నిజమైతే కాంగ్రెస్ నేతలు కేంద్ర సంస్థ చర్యను ఎందుకు తప్పుపట్టలేదు. ఇంతకూ విజయన్‌పై దాడి ఎందుకు చేసినట్లో తెలుసా! కేవలం కోటీ 72లక్షల రూపాయల మేరకు అవినీతి జరిగిందనే పేరుతో చేసిన దాడులు. విజయన్ కుమార్తె వీణ అనేకమంది మాదిరే బెంగళూరులో ఎక్సా లాజిక్ కన్సల్టెన్సీ అనే ఒక చిన్న కంపెనీ పెట్టుకున్నారు. 2017 నుంచి 2020 వరకు ఆ కంపెనీ ఒక ప్రభుత్వ సంస్థకు సాఫ్ట్‌వేర్ సేవలను అందించి నందుకు ఈ నగదు పొందిందన్నది ఆరోపణ. ఇప్పుడా కంపెనీ అసలు ఎలాంటి కార్య కలాపాలు నిర్వహించటం లేదు. అవినీతి డబ్బు చేతులు మారిందని గతంలో కాంగ్రెస్ ఆరోపించింది, ఇప్పుడు బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఒకరు ఈడికి ఫిర్యాదు చేశారు. కంపెనీని మూసివేసిన ఆరేండ్ల తరువాత ఈడి దాడులు చేసింది. దీనర్థం ఇప్పుడు చేయవద్దని కాదు, జనం సొమ్ము ఎంతైనా సరే విచారణ జరపాల్సిందే. లావాదేవీలన్ని చట్టబద్దంగానే జరిగాయి గనుక వాటిని దాచేందుకేమీ ఉండదు. ఎందరో ఘరానా పెద్దలు, కార్పొరేట్ల అధిపతులు, వందలు, వేల కోట్ల రూపాయల కుంభ కోణాలకు పాల్పడి ఎలా తప్పించుకుంటున్నారో తెలిసిందే. అలాంటి వారు బీజేపీలో చేరినా, ఆ పార్టీకి ఎన్నికల బాండ్లో, మరోపేరుతోనో వందల కోట్లు నిధులు ఇచ్చినా 'వాషింగ్ పౌడర్ నిర్మా' తంతు తెలిసిందే. రెండోసారి అసోం సీఎం హిమంత బిశ్వశర్మ కాంగ్రెస్‌నేతగా ఉండగా బీజేపీ పెట్టిన చార్జిషీటు గురించి, ఇప్పుడు బెంగాల్ బీజేపీ సీఎంగా పీఠమెక్కిన సువేందు అధికారి గురించి స్వయంగా మోడీ చేసిన అవినీతి ఆరోపణల గురించి ఏ కేంద్ర దర్యాప్తు సంస్థా ఎలాంటి దాడులు చేయలేదు.అందుకే ఏనుగులు దూరే కంతలను వదలి దోమలు దూరేవాటి దగ్గర కూర్చున్నట్లుగా ఈడి తీరు ఉంది!

## తడిసిన, మొలకెత్తిన ధాన్యాన్ని

# ప్రభుత్వం కొనుగోలు చేయాలి.

**-మరో నాలుగు రోజుల్లో నియోజకవర్గంలోని మొత్తం ధాన్యం కొనుగోలు పూర్తి చేయాలి.**

**-శేరిపల్లి, కామారం కొనుగోలు కేంద్రాలను పరిశీలించిన మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్ రెడ్డి..**

**మెదక్ జిల్లా -28మే, (మహాప్రభ,)**

మెదక్ జిల్లా నార్సింగి మండలంలోని శేరిపల్లి ధాన్యం కొనుగోలు కేంద్రంతో పాటు శంకరంపేట్ ఆర్ మండలం కామారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మ దేవేందర్ రెడ్డి సందర్శించి అక్కడి పరిస్థితులను పరిశీలించారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రాల్లో ఉన్న రైతులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి కారణంగా రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.రైతులు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ధాన్యం కొనుగోళ్లు సక్రమంగా జరగడం లేదని, కొనుగోలు ప్రక్రియ చాలా నెమ్మదిగా కొనసాగుతోందని తెలిపారు. ముఖ్యంగా లారీలు సమయానికి అందుబాటులో లేకపోవడంతో రోజుల తరబడి ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్దే నిల్వ ఉండిపోతుందని చెప్పారు. అకాల వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ధాన్యం తడిసి మొలకెత్తుతుందనే భయంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని వెల్లడించారు. ఈ సందర్భంగా పద్మా దేవేందర్ రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం రైతుల పట్ల పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు.ధాన్యానికి మొలుకులు వస్తున్నా ప్రభుత్వం కొనుగోళ్లను వేగవంతం చేయడంలో పూర్తిగా విఫలమైందన్నారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు కనీస మౌలిక వసతులు కూడా లేవని ఆగ్రహం వ్యక్తం చేశారు.శేరిపల్లి కొనుగోలు కేంద్రంలో 250 సీరియల్ నంబర్లు ఉండగా ప్రస్తుతం 140 సీరియల్ మాత్రమే నడుస్తోందని, కామారం కేంద్రంలో 140 సీరియల్ నంబర్లు ఉండగా కేవలం 80 మాత్రమే



కొనసాగుతున్నాయని తెలిపారు. ఇంకా దాదాపు 10 లారీల ధాన్యం కొనుగోలు కోసం ఎదురుచూస్తోందన్నారు. కామారం గ్రామానికి చెందిన రైతు కృష్ణ లక్ష్మి ధాన్యం 30 రోజులుగా నిల్వ ఉండటంతో మొలకలు వచ్చాయని బాధ వ్యక్తం చేశారని తెలిపారు.తడిసిన, మొలక వచ్చిన ధాన్యాన్ని కూడా ప్రభుత్వం బైలార్ రైస్ మిల్లులకు తరలించి కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. మరో నాలుగు రోజుల్లో మొత్తం ధాన్యం కొనుగోలు ప్రక్రియ పూర్తి చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.అధికారులకు సమయపాలన లేకపోవడం, ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేకపోవడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం రైతాంగాన్ని కన్నీరు పెట్టిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ హయాంలో ప్రతి గింజ ధాన్యాన్ని కొనుగోలు చేశామని గుర్తు చేశారు. ప్రస్తుతం రైతులు కష్టపడి పండించిన పంటను కొనుగోలు చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. అకాల వర్షాలు పడుతున్నప్పటికీ ధాన్యం తరలింపుపై అధికారులు సరైన చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు.కొనుగోలు కేంద్రాల్లో కనీస వసతులు కూడా లేకపోవడం దారుణమన్నారు. రైతులు ఎండలో, వర్షంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ధాన్యాన్ని రక్షించేందుకు తగిన టార్పాలిన్లు, తాగునీటి సౌకర్యం వంటి ప్రాథమిక వసతులు కూడా కల్పించలేదని మండిపడ్డారు.

రైతుల కష్టాలను దృష్టిలో పెట్టుకుని మెదక్ నియోజకవర్గంలోని మొత్తం ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసి రైతులకు ఎలాంటి నష్టం జరగకుండా అధికారులు యుద్ధప్రాతిపదికన పనిచేయాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎలాంటి పరిపాలన చేస్తుందో అర్థం కావడం లేదని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం కళ్లు తెరిచి నాలుగు రోజుల్లో మొత్తం ధాన్యం కొనుగోలు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.వీరి వెంట శంకరంపేట మరియు నార్సింగ్ మండల అధ్యక్షులు పట్లోరి రాజు, కుమ్మరి బాబు, నార్సింగ్ మండల మాజీ జడ్పీటీసీ కృష్ణారెడ్డి,మాజీ మండల అధ్యక్షుడు కోల్కురి లక్ష్మారెడ్డి,

సర్పంచ్‌లు గొండస్వామి,ఇమ్మడి నరేష్, మాజీ సర్పంచ్‌లు పూలపల్లి యాదగిరి యాదవ్, శ్రీనివాస్ రెడ్డి, దయానంద్ యాదవ్, మండల నాయకులు పడాల శ్రీనివాస్, ఏమా వెంకటేశం, వడ్డెర సిద్దిరాములు, మహేష్ గౌడ్, అంజయ్య, నర్సింగరావు, యూత్ నాయకులు సురేష్, సురేష్ తదితరులు ఉన్నారు.

# వాస్తవాధీన రేఖపై భారత్ చైనా చర్చలు

**న్యూఢిల్లీ మే 28 మహాప్రభ**

తూర్పు లడఖ్‌లోని వాస్తవాధీన రేఖ వెంబడి నెలకొన్న పరిస్థితిపై భారత్, చైనాలు చర్చలు జరిపాయి. ఈ చర్చలు చాలా నిర్మాణాత్మకంగా జరిగాయని, ఇరు దేశాల మధ్య సంబంధాల పురోగతికి ఇవి ఎంతో దోహదపడనున్నాయని భారత విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ గురువారం ఓ ప్రకటన విడుదల చేసింది. కాగా, బుధవారం (మే 27) బీజింగ్‌లో జరిగిన సంప్రదింపులు, సమన్వయ కార్యనిర్వహణ యంత్రాంగం (డబ్ల్యుఎంసిసి) సమావేశంలో ఇరుపక్షాలు సరిహద్దు పరిస్థితికి సంబంధించిన వివిధ అంశాలపై చర్చించాయి. ఈ సమావేశం అనంతరం డబ్ల్యుఎంసిసి సమావేశంలో సరిహద్దులపై జరిగిన చర్చలు భవిష్యత్ దృష్ట్యా చాలా నిర్మాణాత్మకంగా



జరిగాయని గురువారం భారత విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ ప్రకటన వెల్లడించింది. 2020లో జరిగిన ఘోరమైన గాల్వాన్ లోయ ఘర్షణలు, తదనంతరం నాలుగేళ్లకు పైగా కొనసాగిన సైనిక ప్రతిష్టంభన కారణంగా భారత్ -- చైనా సంబంధాలు అంత పటిష్టంగా లేవు. ఇరు దేశాల మధ్య సంబంధాలను పునర్నిర్మించుకోవడానికి గత ఏడాది కాలంలో అనేక చర్యలను చేపట్టాయి. ఈ నేపథ్యంలో బీజింగ్‌లో జరిగిన డబ్ల్యుఎంసిసి సమావేశంలో ఇరుపక్షాలు భారత్- చైనా సరిహద్దు ప్రాంతాల్లోని పరిస్థితులపై సమీక్షించాయి. సరిహద్దు ప్రాంతాలలో శాంతిభద్రతలను కాపాడటంలో సాధించిన పురోగతి పట్ల వారు సంతృప్తి వ్యక్తం చేశారు. ఇది ద్వైపాక్షిక సంబంధాలను క్రమంగా సాధారణీకరించే దిశగా పురోగతికి దోహదపడింది. డబ్ల్యుఎంసిసి సమావేశం తర్వాత చైనాలో జరగనున్న ప్రత్యేక ప్రతినిధుల తదుపరి సమావేశానికి సమగ్ర సన్నాహాలు చేసేందుకు కలిసి పనిచేయడానికి కూడా ఇరుపక్షాలు అంగీకరించాయి అని ఈ ప్రకటన పేర్కొంది

# తీవ్రమైన నిరుద్యోగాన్ని ఎదుర్కొంటున్న వెస్ట్‌బ్యాంక్ గ్రాడ్యుయేట్లు

**గాజా ,న్యూఢీల్లి మే 28 మహాప్రభ**

పెరుగుతున్న నిరుద్యోగం, జీతాల బకాయిలు, వలసలు పాలస్తీనా విశ్వవిద్యాలయ గ్రాడ్యుయేట్ల అవకాశాలను తగ్గిస్తున్నాయని గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ఆక్రమిత వెస్ట్ బ్యాంక్‌లో నిరుద్యోగం విపరీతంగా పెరిగిపోవడం, ప్రభుత్వ రంగ నియామకాలు లేకపోవడం, మరోవైపు నైపుణ్యం కలిగిన కార్మికులు అధిక సంఖ్యలో ఆ ప్రాంతాన్ని విడిచి వెళ్తుండటంతో.. అక్కడే ఉన్న పాలస్తీనా విశ్వవిద్యాలయ పట్టభద్రులు ఉద్యోగావకాశాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పాలస్తీనా ఎకనామిక్ పాలసీ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్(ఎంఎఎస్) గణాంకాల ప్రకారం ఆక్రమిత వెస్ట్ బ్యాంక్‌లో డిప్లమా చేసిన




యువ పాలస్తీనియన్లలో 40 శాతం మంది నిరుద్యోగులుగా ఉన్నారు. అక్టోబర్ 2023లో ఉన్న నిరుద్యోగం కంటే ఇప్పుడు రెట్టింపు పెరిగింది. 2024 ప్రారంభంలో 35.2 శాతం గరిష్ట స్థాయికి చేరుకుని, 2025 చివరి నాటికి 27.5 శాతానికి తగ్గింది. గాజాపై యుద్ధం ప్రారంభమైన తర్వాత, ఇజ్రాయెల్‌లో ఉపాధి పొందుతున్న వెస్ట్ బ్యాంక్‌కు చెందిన 1,15,000 మంది పాలస్తీనియన్ల పని అనుమతులను ఇజ్రాయెల్ నిలిపివేయడంతో ఈ సంక్షోభం తీవ్రమైంది. ఇక అప్పటి నుండి ఇజ్రాయిల్ పరిమిత సంఖ్యలోనే ఉద్యోగవకాశాల్ని కల్పించింది. ఉద్యోగ అవకాశాలు క్షీణించడం విశ్వవిద్యాలయ విద్యార్థుల్లో అనిశ్చితిని పెంచింది. గ్రాడ్యుయేషన్ సమీపిస్తున్న కొద్దీ చాలా మంది విద్యార్థులు తమ డిగ్రీల విలువను ప్రశ్నిస్తున్నారని బెత్లెహెం విశ్వవిద్యాలయ అకాడెమిక్, కెరీర్ సలహాదారు ఎనాస్ ఎలియాస్ అన్నారు.

# పార్కింగ్ విషయంలో గొడవ..

### ఆమ్ ఆద్మీ పార్టీ నేతపై కాల్పులు.. తీవ్ర గాయాలు

**న్యూఢీల్లి మే 28 మహాప్రభ**

: పంజాబ్‌లోని అమృత్‌సర్‌లో కాల్పులు కలకలం రేపాయి. ఆమ్ ఆద్మీ పార్టీ నేతపై పొరుగింటి వ్యక్తి కాల్పులు జరిపాడు. ఈ ఘటనలో బాధితుడు తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అమృత్‌సర్ పట్టణంలోని ఒక వార్డుకు జైపాల్ సింగ్ బాహు అనే నేత ఆమ్ ఆద్మీ పార్టీ ఇంఛార్జ్‌గా వ్యవహరిస్తున్నాడు. కోట్ ఆత్మా రామ్ ప్రాంతంలో ఉండే అతడికి, పొరుగింటి వ్యక్తికి మధ్య పార్కింగ్ విషయంలో గురువారం మధ్యాహ్నం వివాదం చెలరేగింది.అది పెరిగి ఇద్దరి మధ్యా గొడవ జరిగింది. ఒకరిని ఒకరు దూషించుకున్నారు. ఈ క్రమంలో ఆ



వ్యక్తి తన గన్ తీసుకొచ్చి జైపాల్ సింగ్ బాహుపై కాల్పులు జరిపాడు. ఈ ఘటనలో అతడికి తీవ్ర గాయాలయ్యాయి. రక్తస్రావం జరిగింది. వెంటనే అతడిని కుటుంబ సభ్యులు స్థానిక ప్రైవేటు ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. అతడి ఒంట్లోంచి బుల్లెట్లు దూసుకుపోయినట్లు వైద్యులు తెలిపారు. అయితే, కీలకమైన అవయవాలకు ఎలాంటి హానీ కలగలేదని చెప్పారు. ఏ అవయవాన్ని తాకకుండానే బుల్లెట్ బయటకు వెళ్లిందన్నారు. ప్రస్తుతానికి అతడికి ప్రాణాపాయం ఏమీ లేదని వైద్యులు వెల్లడించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు జరుపుతున్నారు. నిందితుడిని అదుపులోకి తీసుకుంటామన్నారు. ఈ ఘటనకు సంబంధించిన దృశ్యాలు అక్కడి సీసీ కెమెరాలో రికార్డయ్యాయి. బాధితుడు జైపాల్ సింగ్ బాహు.. స్థానిక ఆప్ ఎమ్మెల్యే ఇంద ర్బీర్ సింగ్ నిజ్జార్‌కు సన్నిహితుడు. ఈ ఘటన సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే ఆస్పత్రికి వెళ్లి బాధితుడిని పరామర్శించారు.


# ఎన్టీఆర్ 103వ జయంతి సందర్భంగా ఘన నివాళులు



**శేరిలింగంపల్లి, మే 28 (మహాప్రభ)**
తెలుగు జాతి గర్వకారణం, పద్మశ్రీ పురస్కార గ్రహీత, మహానటుడు మరియు దూరదృష్టి కలిగిన మహానేత డాక్టర్ నందమూరి తారక రామారావు (ఎన్టీఆర్) 103వ జయంతి వేడుకలు మియాపూర్ పరిధిలోని జేపీ నగర్ మరియు దీప్తి శ్రీనగర్ డివిజన్‌లలో ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమాలకు టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మరియు శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ వి. జగదీశ్వర్ గౌడ్ , మియాపూర్ యువ నాయకులు యలమంచి ఉదయ్ కిరణ్ , నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు మరియు అభిమానులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు, అభిమానులు మరియు కార్యకర్తలు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. తెలుగు ప్రజలకు ఆత్మగౌరవాన్ని తీసుకువచ్చిన మహానేతను స్మరించుకుంటూ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడిన నాయకులు మాట్లాడుతూ, ఎన్టీఆర్ కేవలం ఒక నాయకుడు మాత్రమే కాకుండా ఓ మహా విప్లవం, తరతరాలకు స్ఫూర్తిగా నిలిచే మహనీయుడని పేర్కొన్నారు. మహిళలకు ఆస్తి హక్కులు, వికేంద్రీకృత పాలన, పేదలకు గృహాల కల్పన, రూ.2 కిలో బియ్యం పథకం వంటి ఎన్నో సంక్షేమ కార్యక్రమాల ద్వారా ఎన్టీఆర్ గారు ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని తెలిపారు. "సమాజమే దేవాలయం – – ప్రజలే దేవుళ్లు" అనే ఎన్టీఆర్ సిద్ధాంతం నేటికీ సమాజానికి మార్గదర్శకంగా నిలుస్తోందని అన్నారు.
ఈ కార్యక్రమంలో మన్నేపల్లి సాంబశివరావు, కావూరి ప్రసాద్, కట్ల శేఖర్ రెడ్డి, సునీల్, గిరి, అశోక్, బాలకృష్ణ, కృష్ణ గౌడ్, శ్రీనివాస్, నాని, గురువులు, రాధాకృష్ణ, చారి, రామ్, వెంకటేష్, ప్రవీణ్, సాయి తదితరులు పాల్గొని ఎన్టీఆర్ ఘన నివాళులు అర్పించారు.

# కామారెడ్డిలో అంతరాష్ట్ర కిడ్నాప్ ముఠా కలకలం



**-అక్రమ తుపాకీతో వ్యాపారవేత్త అపహరణకు స్కెచ్..**
**- తాడ్వాయి పోలీసుల చాకచక్యంతో భగ్నం**

**తాడ్వాయి, మే 28: (మహాప్రభ)**
కామారెడ్డి జిల్లాలో ఓ అంతరాష్ట్ర కిడ్నాప్ ముఠా వ్యవహారం కలకలం రేపింది. అక్రమ తుపాకీతో వ్యాపారవేత్తను కిడ్నాప్ చేసి భారీగా డబ్బు వసూలు చేయాలని పన్నిన కుట్రను తాడ్వాయి పోలీసులు భగ్నం చేశారు. ఈ కేసులో మహారాష్ట్రకు చెందిన ఇద్దరితో సహా మొత్తం ఆరుగురిని అరెస్ట్ చేసి, ఒక ఫైర్ ఆర్మ్, రబ్బర్ బుల్లెట్లు, మాస్కులు, తాడు తదితర సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. ఈ వివరాలను జిల్లా ఎస్పీ ఎం. రాజేష్ చంద్ర ఐపీఎస్ వెల్లడించారు. పోలీసుల కథనం ప్రకారం.. తాడ్వాయి పోలీస్ స్టేషన్ పరిధిలోని కృష్ణాజీవాడి శివాలయం సమీపంలో కొంతమంది అనుమానితులు నేరానికి పన్నాగం పన్నుతున్నట్లు విశ్వసనీయ సమాచారం అందడంతో ఎస్ఐ నరేష్ సిబ్బందితో కలిసి అక్కడికి చేరుకున్నారు. పోలీసులను గమనించిన అనుమానితులు పరారయ్యే ప్రయత్నం చేయగా వెంటాడి అదుపులోకి తీసుకున్నారు. ఎస్పీ ఆదేశాల మేరకు ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాస్ రావు పర్యవేక్షణలో సదాశివనగర్ సీఐ సంతోష్ కుమార్, తాడ్వాయి ఎస్ఐ నరేష్, ఇతర పోలీసు సిబ్బందితో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి విచారణ చేపట్టారు. దర్యాప్తులో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. కామారెడ్డికి చెందిన వ్యాపారవేత్త భూస శ్రీనివాస్ వద్ద పెద్ద మొత్తంలో నగదు ఉంటుందని భావించిన నిందితులు, పాత అప్పులు చెల్లించకుండా తప్పించుకోవడంతో పాటు అతన్ని కిడ్నాప్ చేసి కుటుంబ సభ్యుల నుంచి భారీ మొత్తం వసూలు చేయాలని కుట్ర పన్నారు. ఇందుకోసం భయపెట్టేందుకు అక్రమ తుపాకీ అవసరమని నిర్ణయించి మహారాష్ట్రకు చెందిన అజయ్, వైభవ్‌లను సంప్రదించారు. వారి ద్వారా నాయగావ్‌కు చెందిన మారుతి ఘోకే వద్ద రూ.30 వేలకుపైగా ఒప్పందం కుదుర్చుకుని అడ్వాన్స్‌గా రూ.27 వేల నగదు చెల్లించినట్లు విచారణలో తేలింది. ఈ నెల 27న మహారాష్ట్ర నుంచి తీసుకొచ్చిన తుపాకీని కృష్ణాజీవాడి సమీపంలో నిందితులకు అప్పగించే సమయంలో పోలీసులు దాడి చేసి కుట్రను భగ్నం చేశారు.


**స్వాధీనం చేసుకున్న వస్తువులు**
- ఒక నల్లరంగు ఫైర్ ఆర్మ్
- 5 రబ్బర్ బుల్లెట్లు
- 2 ఎయిర్ రైఫిల్ పెల్లెట్ బాక్సులు
- 5 మొబైల్ ఫోన్లు
- హీరో స్ప్లెండర్ ప్లస్ బైక్
- రెండు మంకీ క్యాప్స్
- 3 మాస్కులు
- నైలాన్ తాడు
- పసుపు రంగు టేప్
- నల్ల గాగుల్స్
- రూ.3 వేల నగదు

**అరెస్ట్ అయిన నిందితులు**
1. నిట్టు నర్సింగా రావు -- చిట్యాల
2. సూర స్వామి అలియాస్ వడ్డె స్వామి -- సంతాయిపేట్
3. పులి ప్రశాంత్ గౌడ్ -- సంతాయిపేట్
4. సురం స్వామి -- చిట్యాల
5. వైభవ్ ప్రకాశ్ బరాడేవర్ -- నాయగావ్, మహారాష్ట్ర
6. అజయ్ హన్మంత రావ్ గోంగపాలే -- కొకులేగావ్, మహారాష్ట్ర

ప్రధాన నిందితుడు నిట్టు నర్సింగా రావుపై గతంలో హత్యాయత్నం కేసు నమోదైందని పోలీసులు తెలిపారు. మరో నిందితుడు మారుతి ఘోకే పరారీలో ఉండగా, అతడి కోసం ప్రత్యేక బృందాలు గాలింపు చర్యలు చేపట్టాయి. నిందితులపై తాడ్వాయి పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నెంబర్ 77/2026 కింద బీఎన్ఎస్ సెక్షన్ 61(2), ఆర్మ్స్ యాక్ట్ 3, 4, 25(1బాబా) ప్రకారం కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు వెల్లడించారు. వ్యాపారవేత్తలు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద వ్యక్తులు కనిపించినా లేదా అక్రమ ఆయుధాల సమాచారం తెలిసినా వెంటనే డయల్-100 లేదా సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని ఎస్పీ సూచించారు.

## మతసామరస్యం, పవిత్రతకు బక్రీద్ ప్రతీక.

-ఎమ్మెల్యే - నేనావత్ బాలు నాయక్





**దేవరకొండ మే 28 ( మహాప్రభ )**
బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకొని గురువారం చింతపల్లి మండల కేంద్రంలో ఈద్గా వద్ద ముస్లిం సోదరులతో కలిసి బక్రీద్ వేడుకల్లో పాల్గొని,ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించిన దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ ఈద్ అల్-అధా (బక్రీద్) పర్వదినం సందర్భంగా ముస్లిం సోదర, సోదరీమణులందరికీ హార్దిక శు భాకాంక్షలు తెలియజేశారు. త్యాగం, ప్రేమ, దయ, సహనం అనే మహత్తర విలువలను గుర్తు చేసే ఈ పవిత్ర పర్వదినం ప్రతి ఇంటిలో ఆనందం, శాంతి, ఐక్యతను నింపాలని ఆకాంక్షించారు. భగవంతుడి కరుణాకటాక్షాలు అందరిపై ఉండాలని, ప్రతి ఒక్కరి జీవితంలో ఆరోగ్యం, సంతోషం, అభివృద్ధి కలగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, ముఖ్య నాయకులు, ముస్లిం సోదరులు తదితరులు పాల్గొన్నారు.

## ముస్లిం సోదర సోదరీమణులకు బక్రీద్ పండగ శుభాకాంక్షలు.

**-జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్.**
**-ముస్లిం సోదరులకు త్యాగనిరతి, దైవభక్తికి ప్రతీక బక్రీద్ (ఈద్-ఉల్-అజ్హా)..**



**మెదక్ జిల్లా -28మే (మహాప్రభ )**
గురువారం బక్రీద్ పండుగ పురస్కరించుకుని మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమసింగ్ ముస్లిం సోదరీ సోదరీమణులకు. ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ త్యాగనిరతికి ప్రతీకగా జరుపుకునే పండుగ బక్రీద్ అని అన్నారు. దైవాజ్ఞను అనుసరించి సమాజ హితం కోరి ప్రతిమానవుడు నిస్వార్థ సేవలను అందించాలనే సందేశం బక్రీద్ మనకు అందిస్తుందని అన్నారు..తమకు కలిగిన దాంట్లోంచి ఎంతో కొంత పంచడమనే దాతృత్వ స్వభావాన్ని బక్రీద్ పండుగ ద్వారా నేర్చుకోవాలని అన్నారు. . అల్లా ఆశీస్సులతో ప్రజలు, రైతులకు, సకాలంలో వర్షాలు కురిసి, సుఖసంతోషాలతో అష్టశ్వర్యాలతో ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు జీవించాలని మనస్ఫూర్తిగా కోరారు.

## ఘనంగా ఎన్టీఆర్ జయంతి వేడుకలు

**పెద్దపల్లి, మే 28 ( మహాప్రభ )**
విశ్వవిఖ్యాత నటసార్వభౌముడు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు జయంతి సందర్భంగా పెద్దపల్లి పట్టణంలోని అయ్యప్ప ఆలయ ఆవరణలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు పాల్గొన్నారు. స్థానిక నాయకులు, కార్యకర్తలు కూడా హాజరై ఎన్టీఆర్ సేవలను స్మరించుకున్నారు. తెలుగు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన ఎన్టీఆర్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి.

## రామాయంపేట మున్సిపాలిటీలో ఘనంగా బక్రీద్ పండగ



**రామాయంపేట మే 28 మహాప్రభ**
బక్రీద్ అనేది ముస్లింల ముఖ్యమైన పండుగలు ఒకటి దీనిని త్యాగ పండుగ, అని కూడా అంటారు ఈ పండుగను అల్లా అజ్ఞకు విధేయతగా చూపిన సంఘటన స్మరించుకుంటూ జరుపుకుంటారు .బక్రీద్ సారాంశం.. అల్లోపట్ల భక్తి, విధేయత మరియు త్యాగభావాన్ని తెలియజేసే పండుగ ముస్లింలు ప్రత్యేక నమాజ్ నిర్వహిస్తారు కుర్బానీ త్యాగం చేస్తారు. సాధారణంగా మేక గొర్రె వంటి జంతువులను కుర్బానీ మాంసాన్ని కుటుంబ సభ్యులు బంధువులు మరియు పేదలతో పంచుకుంటారు. ప్రేమ సహాయం మానవత్వం మరియు దానం అనే విలువలను ఈ పండుగ బోధిస్తుంది కుటుంబ సభ్యులు. స్నేహితులతో కలిసి ఆనందంగా జరుపుకుంటారు . త్యాగం దానం సహనం మరియు సోదర భావాన్ని సందేశాన్ని బక్రీద్ మనకు తెలియజేస్తుంది

## బక్రీద్ సందర్భంగా ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు


ఘనంగా పండగ వేడుకలు





**గాంధారి, మే 28 (మహాప్రభ)**
బక్రీద్ పండగను పురస్కరించుకొని గాంధారి మండల కేంద్రంలో ముస్లిం సోదరులు గురువారం నిర్వహిస్తున్న ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తున్నారని. (ఈద్-ఉల్-అధా) త్యాగానికి, దేవునిపై విధేయతకు ప్రతీకగా ముస్లింలు జరుపుకునే పవిత్ర పండుగ. ప్రవక్త ఇబ్రాహీం తన కుమారుడు ఇస్మాయిల్‌ను అల్లాహ్ ఆజ్ఞ మేరకు బలి ఇవ్వడానికి సిద్ధపడిన త్యాగనిరతిని స్మరిస్తూ, జిల్-హిజ్జా నెలలో ఈ పండుగను జరుపుకుంటారు. ముస్లిం సోదరులు సయ్యద్ ముస్తఫా, గౌస్, నయీమ్, ఫిరోజ్, మత పెద్దలు, పిల్లలు, అందరూ పాల్గొన్నారు.

## చేపలు పట్టేందుకు వెళ్లి ప్రమాదవశాత్తూ వ్యక్తి మృతి...



**పాపన్నపేట మే28( మహాప్రభ )**
చేపలు పట్టేందుకు వెళ్లి ప్రమాదవశాత్తూ నీట మునిగి వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని నాగ్సాన్ పల్లి శివారులోని చెలిమకుంటలో గురువారం చోటు చేసుకుంది.ఎస్సై శ్రీనివాస్ గౌడ్ కథనం ప్రకారం వివరాలు...నాగ్సాన్ పల్లి గ్రామానికి చెందిన గుండు కిష్టయ్య(48) వ్యవసాయంతో పాటు చేపలు పడుతూ జీవితం గడుపుతున్నాడు.కాగా మంగళవారం సాయంత్రం చేపలు పట్టేందుకు వెళ్తున్నానని చెప్పి బయటకు వెళ్లి గ్రామ శివారులో చెలిమ కుంట చెరువులో చేపలు పడుతుండగా కాళ్లకు వల చుట్టుకోవడంతో ప్రమాదవశాత్తూ నీట మునిగి మృతి చెందాడు.తిరిగి ఇంటికి రాలేదు.దీంతో కుటుంబీకులు చుట్టూ పక్కల వెతికారు.గురువారం ఉదయం నాగ్సాన్ పల్లి గ్రామ శివారులోని చెలిమకుంటలో అటుగా వెళ్లిన స్థానికులు నీటిలో మృతదేహాన్ని గమనించి పోలీసులకు, కుటుంబ సభ్యులు సమాచారం అందించడంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని వెలికి తీయించి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మెదక్ జిల్లా ఆసుపత్రికి తరలించారు.మృతుడి కుమారుడు రమేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

## సత్తమ్మ చిత్ర పటానికి నివాళి అర్పించిన దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్



**దేవరకొండ డివిజన్ మే 28( మహాప్రభ )**
చందంపేట మండల కేంద్రానికి చెందిన చిత్రియాల సత్తమ్మ మొదటి వర్ధంతి కార్యక్రమంలో దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ పాల్గొని ఆమె చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులర్పించారు.ఆయన వెంట కేతవత్ శంకర్ నాయక్, బాలు, సత్తయ్య, శ్రీనివాస్,వెంకట్ గౌడ్, నరహరి,చెన్నకేశవులు, శంకర్ గౌడ్, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

# వేగంగా ధాన్యం అన్లోడింగ్ జరగాలి.

-జిల్లా అదనపు కలెక్టర్ నగేష్..



**మెదక్ జిల్లా -28మే (మహాప్రభ,)**
వేగంగా ధాన్యం అన్లోడింగ్ జరగాలని జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ గోడౌన్ నిర్వాహకులను ఆదేశించారు.గురువారం కొల్చారం మండల వరిగుంతం గ్రామంలోని గోడౌను ఆకస్మికంగా తనిఖీ చేశారు. వరి ధాన్యం కొనుగోలు , నిల్వ కోసం ఏర్పాటు చేసిన గిడ్డంగిని పరిశీలించారు. సేకరించిన వరి ధాన్యాన్ని ఈ గిడ్డంగిలో నిల్వ చేయనున్నట్లు తెలిపారు. గిడ్డంగిలోని నిల్వ సామర్థ్యం, అందుబాటులో ఉన్న సౌకర్యాలు ,భద్రతా ఏర్పాట్లను పరిశీలించి సంబంధిత అధికారులకు అవసరమైన సూచనలు అందించారు.ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ మాట్లాడుతూ.. ధాన్యం అన్లోడింగ్ త్వరగా జరగాలని, లారీలను, లేబర్ ను అందుబాటులో ఉంచుకోవాలని, అన్లోడింగ్ ఆలస్యం జరగకుండా మరింత పకడ్బందీగా చర్యలు తీసుకోవాలన్నారు. అన్లోడింగ్ లో హమాలీని షిఫ్ట్ ల ప్రకారం పని చేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కాస్లాపూర్ యాదగిరి తల్లి లక్ష్మీ అంత్యక్రియల్లో పాల్గొన్న మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్ రెడ్డి.



**మెదక్ జిల్లా -28మే (మహాప్రభ,).**
జప్తి శివనూర్ బీఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు కాస్లాపూర్ యాదగిరి తల్లి ఏషబోయిన లక్ష్మీ అంత్యక్రియల్లో మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్ రెడ్డి పాల్గొని కుటుంబ సభ్యులను పరామర్శించారు.ఈ సందర్భంగా లక్ష్మీ కి నివాళు లర్పించి, కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.వీరివెంట శంకరంపేట మరియు నార్సింగ్ మండల అధ్యక్షులు పట్లోరి రాజు, కుమ్మరి బాబు, నార్సింగ్ మండల మాజీ జడ్పీటీసీ కృష్ణారెడ్డి, మాజీ మండల అధ్యక్షుడు కోల్కురి లక్ష్మారెడ్డి, వైస్ ఎంపీపీ సుజాత శంకర్, సర్పంచ్లు సంతోష, గొండస్వామి, ఇమ్మడి నరేష్, మాజీ సర్పంచ్లు పూలపల్లి యాదగిరి యాదవ్, శ్రీనివాస్ రెడ్డి, దయానంద్ యాదవ్, మండల నాయకులు పడాల శ్రీనివాస్, ఏమా వెంకటేశం, వడ్డెర సిద్ధిరాములు, మహేష్ గౌడ్, అంజయ్య, నర్సింగరావు, యూత్ సభ్యులు సురేష్, సురేష్ తదితరులు ఉన్నారు.

## జువ్వాడి గ్రామంలో ఘనంగా పోచమ్మ బోనాలు



**గాంధారి, మే 28 (మహాప్రభ)**
గాంధారి మండలం జువ్వాడి గ్రామంలో పోచమ్మ బోనాలు ఘనంగా ప్రతి సంవత్సరం గ్రామ మహిళలు ప్రత్యేక భక్తిశ్రద్ధలతో అమ్మవారికి ప్రత్యేక బోనాలు ఊరేగింపుతో ప్రారంభించి ఘనంగా వేడుకలు జరుపుతారని గ్రామ పెద్దలు, బిజెపి సీనియర్ నాయకుడు మచ్చర్ల మానస శ్రీకాంత్, పాల్గొని గ్రామంలో ప్రజలు బాగుండాలి పసిడి పంటలు ధనరాశులై ఉప్పొంగాలి పాడి పశువులు బాగుండాలని ప్రతి సంవత్సరం భాజా భజంత్రీతో ఊరంతా బోనాలు తీస్తారని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, కుల సంఘాలు,మహిళలు,పిల్లలు,అందరూ పాల్గొన్నారు.

## రామాయంపేట లో ఆర్టిసి బస్సులో బంగారాన్ని కొట్టేసిన యువతులు

**రామాయంపేట**
**మే 28 మహాప్రభ**



రామాయంపేట ఆర్టీసీ బస్టాండ్ లో జరిగిన బంగారాన్ని కొట్టివేసిన నిందితులను రామాయంపేట పోలీసులు గంటలలోనే కేసు ను చేదించారు బుధవారం రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన మహిళ రామాయంపేట నుండి తన గ్రామానికి వెళ్తుండగా బ్యాగులో నుంచి 4.5 తులాల బంగారం చోరీ చేశారు కేసు నమోదు చేసుకొని గంటల వ్యవధిలోని కేసులు చేదించి ఈ కేసులో కర్ణాటకు చెందిన శిల్ప వేలు ( 20) శ్వేత కాలేజ్(23). మహారాష్ట్రకు చెందిన ఇద్దరు యువతులను అరెస్టు చేసి రిమాండ్ కు తరలించినట్టు పోలీసులు తెలిపారు.

# బక్రీద్ సందర్భంగా ఈద్గాల వద్ద పటిష్ట పోలీసు బందోబస్తు.

**మెదక్ జిల్లా -28మే (మహాప్రభ )**
నవాబ్‌పేట్, గాంధీనగర్ ఈద్గాల వద్ద భద్రతా ఏర్పాట్లను జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు ఐపీఎస్ పరిశీలించారు.బక్రీద్ పండుగ సందర్భంగా మెదక్ పట్టణంలోని నవాబ్‌పేట్, గాంధీనగర్ ఈద్గాల వద్ద ఏర్పాటు చేసిన పోలీసు బందోబస్తును మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు ఐపీఎస్ పరిశీలించారు. పండుగ ప్రశాంత వాతావరణంలో జరగాలని పోలీసు అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు.నవాబ్‌పేట్ ఈద్గా వద్ద అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ ఐపీఎస్ పర్యవేక్షణలో ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు కొనసాగుతున్నాయని ఎస్పీ తెలిపారు.



ఈద్గాల పరిసర ప్రాంతాల్లో పోలీసు పికెటింగ్, మొబైల్ పెట్రోలింగ్, ట్రాఫిక్ నియంత్రణ చర్యలను మరింత కట్టుదిట్టం చేసినట్లు చెప్పారు. పండుగ సందర్భంగా ప్రజలు పరస్పర సహకారంతో శాంతియుతంగా వేడుకలు జరుపుకోవాలని ఎస్పీ కోరారు. సోషల్ మీడియాలో వచ్చే పుకార్లు, అసత్య ప్రచారాలను నమ్మవద్దని సూచించారు. ఎలాంటి అనుమానాస్పద ఘటనలు గమనించిన వెంటనే సమీప పోలీసు సిబ్బందికి లేదా డయల్ 100కు సమాచారం అందించాలని తెలిపారు. జిల్లాలో శాంతి భద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా అన్ని రకాల ముందస్తు చర్యలు చేపట్టామని, ప్రజలు నిర్భయంగా పండుగ జరుపుకునేలా పోలీసు శాఖ అప్రమత్తంగా విధులు నిర్వహిస్తోందని ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు ఐపీఎస్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ గారి వెంట డియస్పి ప్రసన్న కుమార్, సీఐ లు మహేష్, సందీప్ రెడ్డి, ఎస్సై లు సిబ్బంది ఉన్నారు.

# 30 కొనుగోలు కేంద్రాల్లో కొనుగోలు ముగించడం జరిగింది.

**-జిల్లా సివిల్ సప్లై కార్యాలయంలో ధాన్యం కొనుగోలు సమస్యలపై 9391942254 టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు.**

**-రైతులకు. అండగా రాష్ట్ర ప్రభుత్వం..**

**-జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్**

**మెదక్ జిల్లా -28మే (మహాప్రభ )**
అకాల వర్షాల కారణంగా రాష్ట్రంలోని జిల్లాల్లో ధాన్యం తడిసిన పరిస్థితులు నెలకొన్నప్పటికీ రైతులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపడుతోందని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రైతులు పండించిన ప్రతి గింజ ధాన్యాన్ని కొనుగోలు చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రత్యేక చర్యలు అమలు చేస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తూ ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా వేగంగా కొనుగోళ్లు నిర్వహిస్తోందని కలెక్టర్ తెలిపారు.మెదక్ జిల్లాలో ఇప్పటివరకు అకాల వర్షాల ప్రభావంతో ధాన్యం తడిసిన సుమారు 04వేల క్వింటాళ్ల ధాన్యం బాయిల్డ్ మిల్లులకు తరలించామన్నారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, రాబోయే రోజుల్లో కూడా ప్రభుత్వం నిర్ణయించిన ప్రకారం ప్రతి గింజ ధాన్యాన్ని కొనుగోలు చేయడానికి సిద్ధంగా ఉందన్నారు. అనుకొని పరిస్థితుల వర్షాలతో ధాన్యం తడిసినా, నిబంధనల ప్రకారం పరిశీలించి కొనుగోలు చేసేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని తెలిపారు.
తడిసిన ధాన్యాన్ని కూడా నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా పరిశీలించి కొనుగోలు చేయడం ద్వారా ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం రైతులకు అండగా నిలుస్తోందని స్పష్టం చేశారు. జిల్లా వ్యాప్తంగా



ఇప్పటివరకు 62103. రైతుల నుండి 2,85,054.080 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయడం జరిగిందన్నారు.43,433 మంది రైతులకు 468.18 కోట్ల రూపాయలు రైతుల ఖాతాలలో జమ చేశామని వెల్లడించారు. ఇప్పటివరకు జిల్లాలో 30 కొనుగోలు కేంద్రాల్లో కొనుగోలు పూర్తి చేయడం జరిగిందని ఈ సందర్భంగా కలెక్టర్ వెల్లడించారు అకాల వర్షాలను దృష్టిలో ఉంచుకుని జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా వ్యవహరిస్తూ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడవకుండా తగిన రక్షణ చర్యలు చేపడుతోందన్నారు. అవసరమైన చోట టార్పాలిన్లు, నిల్వ సదుపాయాలు, వేగవంతమైన రవాణా ఏర్పాట్లు కల్పిస్తూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు.ప్రొక్యూర్‌మెంట్‌కు సంబంధించిన అన్ని ఏజెన్సీలు, సంబంధిత శాఖల అధికారులు, డీఆర్‌డీఓలు, డీసీఓలు, జీసీసీ ప్రతినిధులు, ధాన్యం కొనుగోలు కేంద్రాల ఇంచార్జ్‌లు అప్రమత్తంగా ఉండాలని ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. వర్షాలు వచ్చే పరిస్థితుల్లో కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యానికి వర్షం వల్ల ఎలాంటి నష్టం కలగకుండా అవసరమైన చోట టార్పాలిన్లతో కప్పి భద్రపరచాలని సూచించినట్లు పేర్కొన్నారు.ధాన్యం కొనుగోలు కేంద్రాలను సంబంధిత శాఖల అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తూ రైతుల సమస్యలను వెంటనే పరిష్కరిస్తున్నారని తెలిపారు. కొనుగోలు ప్రక్రియలో పారదర్శకత పాటిస్తూ రైతులకు సకాలంలో చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు.ధాన్యం కొనుగోలుపై రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రభుత్వం రైతులకు అన్ని విధాలుగా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. రైతులు సమీప కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించి ప్రభుత్వ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రైతులకు ధాన్యం కొనుగోలులో సమస్యలు, సందేహాల పరిష్కారం కోసం జిల్లా సివిల్ సప్లయ్స్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నంబర్/కంట్రోల్ రూం నంబర్. 9391942254 ను సంప్రదించాలని ఆమె ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# వీర్ సావర్కర్ 143వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహణ.

**గడ్డి అన్నారం 28 మే (మహాప్రభ)**
దేశభక్తి, జాతీయ చైతన్యానికి వీర్ సావర్కర్ జీవితం స్ఫూర్తి బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి
వీర్ సావర్కర్ 143వ జయంతి సందర్భంగా గడ్డిఅన్నారం డివిజన్ పరిధిలోని శ్రీ కోదండరాం నగర్ కాలనీలో ఉన్న వి ఆర్ కె సిల్క్స్ వద్ద భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని బీజేపీ డివిజన్ అధ్యక్షులు దాసరి జయ ప్రకాష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బీజేపీ మాజీ కార్పొరేటర్లు బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి, ఆకుల శ్రీవాణి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు వీర్ సావర్కర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ వీర్ సావర్కర్ భారత స్వాతంత్ర్య సమరంలో కీలక పాత్ర పోషించిన మహనీయుడని అన్నారు. ఆయన కేవలం స్వాతంత్ర్య సమరయోధుడే కాకుండా గొప్ప జాతీయవాది, రచయిత, సంఘటకుడిగా దేశ చరిత్రలో చిరస్థాయిగా







నిలిచిపోయారని పేర్కొన్నారు.
దేశం కోసం ఆయన అనుభవించిన కారాగార జీవితం, చేసిన త్యాగాలు ప్రతి భారతీయుడికి ఆదర్శమని తెలిపారు. స్వాతంత్ర్య సమరంలో వీర్ సావర్కర్ పోషించిన పాత్రను దేశ ప్రజలు ఎప్పటికీ మరువలేరని, దేశభక్తి, సంస్కృతి పరిరక్షణ, జాతీయ చైతన్యానికి ఆయన జీవితం స్ఫూర్తిదాయకమని కొనియాడారు. నేటి యువత వీర్ సావర్కర్ ఆశయాలను ఆదర్శంగా తీసుకొని దేశాభివృద్ధికి కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు చిలకూరి రామ్ రెడ్డి, ఆకుల అంజన్, ఏనుగు శ్రీధర్ రెడ్డి, కృష్ణంరాజు, నర్సింహా రెడ్డి, రత్నం, గోవర్ధన్, హరి ప్రసాద్, వివేక్ చారీ, శివ రామ్, టీంకు, వంశీ గంగపుత్ర, గిరీష్, జీవన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రామాయంపేట పిఎసిఎస్ లో 44 జీవో ఉన్నట్టా లేనట్టా దీనిపై అధికారుల చర్యలేవి

**--రామాయంపేట లో జీవో 44 తుంగలోకి తొక్కిన అక్రమ నియమకాలపై చర్యలేవి**

**-జియో నెంబర్ 44 ఉన్నట్టా లేనట్టా**

**రామాయంపేట మే 28 మహాప్రభ**
రామాయంపేట ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘంలో జీవో 44 ప్రకారం ఒక సీఈఓ . ఆడిటర్ ముగ్గురు సూపర్వైజర్లు విధులు నిర్వహిస్తుండగా జీవో నెంబర్ 44 ను కాదని ప్రస్తుత పాలకవర్గం లక్షల రూపాయలు దండుకొని అదనంగా




మరో నలుగురిని వీధిలోకి తీసుకొని ఉద్యోగ బాధ్యతలు అప్పజెప్పిన ట్లు జిల్లా సహకార సంఘంలో రైతులు గుసగుసలాడుతున్నారు దీనిపై జిల్లా యంత్రాంగం దృష్టి సాధించగా పోవడం సోషనియం , ఇది ఇలానే కొనసాగిస్తే డి సి ఓ . (ఐఏశీ ) ఆఫీస్ మెదక్ ముట్టడిస్తామని సహకార సంఘ సభ్యులు హెచ్చరిస్తున్నారు మరియు ఇందులో అవినీతిపై విచారణ జరిపి పాలకవర్గంపై చర్యలు తీసుకోవాలని సంఘ సభ్యులు హెచ్చరిస్తున్నారు పై అధికారులు దీనిపై విచారణ చేయకుంటే భారీ ఎత్తున ధర్నాలు చేస్తామని సంఘ సభ్యులు హెచ్చరిస్తున్నారు.

# బిజినెస్

## హ్యుందాయ్ కార్లు మరింత ప్రియం



**న్యూఢిల్లీ,**
హ్యుందాయ్ సంస్థ కూడా కొనుగోలుదారులకు షాకిచ్చింది. అన్ని రకాల మాడళ్ల ధరలను రూ.12, 800 వరకు పెంచుతున్నట్టు తాజాగా ప్రకటించింది. నిర్వహణ ఖర్చులు పెరగడంతోపాటు రూపాయి పతనం చెందడంతో సంస్థపై పడుతున్న భారాన్ని తగ్గించుకోవడంలో భాగంగా వాహన ధరలు పెంచాల్సి వచ్చిందని పేర్కొంది.గత నెలలోనే ఒక్క శాతం వరకు సవరించిన సంస్థ మళ్లీ వచ్చే నెల నుంచి అమల్లోకి వచ్చేలా ఆయా మాడళ్ళను బట్టి రూ.12,800 వరకు సవరించింది. ఉత్పత్తి వ్యయం అధికం కావడం, కమోడిటీ ఉత్పత్తుల ధరలు పుంజుకోవడం, నిర్వహణ ఖర్చులు పెరుగడం వల్లనే ధరలు సవరించాల్సి వచ్చిందని కంపెనీ వర్గాలు వెల్లడించాయి.

## బంగారం ధరల్లో బిగ్ క్రాష్..

**-ఒక్కరోజులోనే భారీగా పతనం..**

**- ఏపీ, తెలంగాణలో తులం ఎంతంటే..?**




బంగారం కొనుగోలు చేసేవారికి భారీ గుడ్ న్యూస్. గత కొంతకాలంగా పెరుగుతున్న ధరల నుంచి భారీ ఊరట లభించింది. గురువారం ధరలు భారీగా కుప్పకూలాయి. అమెరికా-ఇరాన్ మధ్య శాంతి ఒప్పందం త్వరలో జరగనుందని ట్రంప్ ప్రకటన చేసిన క్రమంలో ధరలు పడిపోతూ వస్తోన్నాయి. దీంతో ఈ పతనం మరింత కొనసాగవచ్చని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఈ తగ్గింపు తర్వాత ప్రస్తుతం బంగారం, వెండి ధరలు ఎలా ఉన్నాయో చూద్దాం.హైదరాబాద్‌లో 10 గ్రాములు 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,56,060 వద్ద కొనసాగుతోండగా.. గురువారం ఒక్కరోజే రూ.2230 తగ్గింది. ఇక 22 క్యారెట్ల గోల్డ్ రేటు రూ.1,43,050 వద్ద ట్రేడవుతోండగా.. నేడు రూ.2050 పతనమైంది. ఇక విజయవాడ, విశాఖపట్నంలో కూడా ఇవే ధరలు కొనసాగుతున్నాయి.చెన్నైలో 24 క్యారెట్ల గోల్డ్ రేటు రూ.1,58,180గా ఉండగా.. నిన్నటితో పోలిస్తే రూ.1640 పతనమయ్యాయి. అటు 22 క్యారెట్ల ధర రూ.1,45,000గా ఉండగా.. ఇవాళ రూ.1500 మేర క్రాష్ అయ్యాయని చెప్పవచ్చు. బెంగళూరులో 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,56,060 వద్ద కొనసాగుతుండగా.. 22 క్యారెట్ల ధర రూ.1,43,050గా ఉంది.దేశ రాజధాని ఢిల్లీలో 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,56,060గా ఉండగా... నిన్నటితో పోలిస్తే రూ.2380 తగ్గింది. అటు 22 క్యారెట్ల ధర రూ.1,43,050గా ఉండగా.. ఇవాళ ఒక్కరోజే రూ.2200 మేర తగ్గుముఖం పట్టింది. అటు వెండి ధరలు కూడా భారీగా తగ్గాయి.ఢిల్లీలో కేజీ సిల్వర్ ధర రూ. 2.75 లక్షలుగా ఉంది. నిన్న రూ.2.85 లక్షల వద్ద స్థిరపడగా.. ఇవాళ ఒక్కరోజే రూ.10 వేలు తగ్గాయి. హైదరాబాద్‌లో కేజీ వెండి ధర రూ.2.85 లక్షల వద్ద ఉండగా.. నిన్న రూ.2.90 లక్షల వద్ద ఉంది. నిన్నటితో చూస్తే నేడు రూ.5 వేలు తగ్గింది. చెన్నైలో కేజీ వెండి ధర రూ.2.85 లక్షల వద్ద కొనసాగుతోంది.

## ఇక డబ్బులు కడితేనే 'మెటా' సేవలు

**- ప్రజలపై అదనపు భారం**

**ఇంటర్నెట్**
ప్రపంచ ప్రముఖ సోషల్ మీడియా సంస్థ మెటా ప్లాట్‌ఫారమ్‌లు ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్‌లకు కొత్త ప్రీమియం సబ్‌స్క్రిప్షన్ ప్లాన్‌లను ప్రకటించడం ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. మెటా ప్రకటించిన ధరల ప్రకారం, ఫేస్‌బుక్ ప్లస్ మరియు ఇన్‌స్టాగ్రామ్ ప్లస్‌కు నెలకు సుమారు రూ.387, వాట్సాప్ ప్లస్‌కు రూ.290 వరకు ఖర్చు కావచ్చు. మెటా తన ఏఐ సేవల కోసం కూడా కొత్త సబ్‌స్క్రిప్షన్ ప్లాన్‌లను ప్రవేశపెట్టింది. "మెటా వన్ ప్లస్" మరియు "మెటా వన్ ప్రీమియం" పేర్లతో రెండు కొత్త ప్లాన్‌లు అందుబాటులోకి రానున్నాయి. మెటా వన్ ప్లస్ ధర నెలకు సుమారుగా రూ. 775 కాగా.. మెటా వన్ ప్రీమియం ధర నెలకు దాదాపుగా రూ. 1,939గా ఉండనున్నాయి. ఒక్కో సేవకు విడిగా చెల్లించాల్సి వస్తే సాధారణ కుటుంబాలపై నెలకు గణనీయమైన అదనపు




వ్యయం పడే అవకాశం ఉంది. దీంతో "డిజిటల్ సేవలు కూడా క్రమంగా ధనికులకు మాత్రమే పరిమితం అవుతున్నాయా?" అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. ఇప్పటివరకు ఉచితంగా అందుబాటులో ఉన్న సేవలకు ఇప్పుడు నెలవారీ రుసుములు విధించడం సాధారణ వినియోగదారులపై అదనపు ఆర్థిక భారం మోపే చర్యగా పలువురు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికే ఇంటర్నెట్, మొబైల్ రీచార్జ్‌లు, ఓటీటీ సబ్‌స్క్రిప్షన్‌లు, క్లౌడ్ సేవలు వంటి డిజిటల్ ఖర్చులు పెరుగుతున్న పరిస్థితుల్లో, సోషల్ మీడియా వేదికలకు కూడా చెల్లింపులు చేయాల్సి రావడం మధ్యతరగతి మరియు యువతపై ప్రభావం చూపే అవకాశముంది. ముఖ్యంగా విద్యార్థులు, చిన్న వ్యాపారులు, కంటెంట్ క్రియేటర్లు రోజువారీ కమ్యూనికేషన్ మరియు ప్రచారం కోసం ఈ ప్లాట్‌ఫారమ్‌లపై ఎక్కువగా ఆధారపడుతున్నారు. ప్రజల్లో మరో ఆందోళన ఏమిటంటే, ప్రస్తుతం "ప్రీమియం ఫీచర్లు" పేరుతో ప్రారంభమవుతున్న ఈ విధానం భవిష్యత్తులో సాధారణ సేవలకూ చార్జీలు విధించే దిశగా మారుతుందేమో అన్నది. ఒకసారి వినియోగదారులను చెల్లింపుల మోడల్‌కు అలవాటు చేస్తే, తర్వాత మరిన్ని ఫీచర్లను చెల్లింపు విభాగంలోకి మార్చే అవకాశం ఉందని టెక్ పరిశీలకులు భావిస్తున్నారు. అయితే మరోవైపు కొందరు వినియోగదారులు ప్రత్యేక ఫీచర్లు అవసరమున్నవారు మాత్రమే చెల్లిస్తారని, సాధారణ సేవలు ఉచితంగానే కొనసాగితే పెద్ద సమస్య ఉండదని అంటున్నారు. అయినప్పటికీ, సోషల్ మీడియా వేదికలు ప్రజల దైనందిన జీవితంలో కీలక భాగంగా మారిన ఈ సమయంలో, కొత్త సబ్‌స్క్రిప్షన్ విధానం సామాన్యులపై ఎంతవరకు ప్రభావం చూపుతుందన్నది రాబోయే రోజుల్లో స్పష్టమవుతుంది.

# స్పోర్ట్స్

## సిక్స్ మెషీన్.. వైభవ్ సూర్యవంశీపై క్రిస్ గేల్ ప్రశంసలు

**చండీఘడ్**
యూనివర్సల్ బాస్ క్రిస్ గేల్ .. యూనివర్సల్ బేబీ బాస్ వైభవ్ సూర్యవంశీపై ప్రశంసలు కురిపించారు. తాజా ఐపీఎల్‌లో గేల్ రికార్డును వైభవ్ బ్రేక్ చేసిన విషయం తెలిసిందే. ఓ ఐపీఎల్ సీజన్‌లో అత్యధిక సిక్సర్లు కొట్టిన రికార్డు గేల్ పేరిట ఉన్నది. అయితే బుధవారం జరిగిన ఐపీఎల్ మ్యాచ్‌లో రాజస్థాన్ బ్యాటర్ వైభవ్ ఆ రికార్డును బ్రేక్ చేశాడు. 2012 సీజన్‌లో గేల్ 59 సిక్సర్లు బాదాడు. ఇక ఇప్పుడు సూర్యవంశీ ఇప్పటికే 65 సిక్సర్లు కొట్టేశాడు. ఎలిమినేటర్ మ్యాచ్‌లో హైదరాబాద్‌పై అతను ఏకంగా 12 సిక్సర్లు బాదాడు. 29 బంతుల్లో 97 రన్స్ చేసిన వైభవ్‌పై యూనివర్సల్ బాస్ గేల్ ప్రశంసలు కురిపించారు. వైభవ్ సూర్యవంశీ అసాధారణ బ్యాటింగ్ చేస్తున్నాడని, అతనో కొత్త సిక్స్ మెషీన్ అని గేల్ అన్నారు. తన ఇన్‌స్టాగ్రామ్‌లో గేల్ స్పందిస్తూ వైభవ్ ను సిక్స్ మెషీన్‌తో పోల్చారు.ఎలిమినేటర్ మ్యాచ్‌లో మరో రికార్డును నెలకొల్పే అవకాశాన్ని సూర్యవంశీ మిస్సయ్యాడు. ఫాస్టెస్ట్ హండ్రెడ్ చేసే అవకాశాన్ని వైభవ్ చేజార్చుకున్నాడు. ఆ రికార్డును మిస్ కావడం దురదృష్టకరమని, ఎలాగైనా ఆ



రికార్డును అతను అధిగమిస్తాడని వైభవ్‌పై గేల్ ప్రశంసలు కురిపించాడు. ఈ సీజన్‌లో ఇప్పటి వరకు సూర్యవంశీ 15 ఇన్నింగ్స్‌లో 680 రన్స్ చేశాడు. యావరేజ్ 45.33గా ఉంది. ఇక స్ట్రయిక్ రేట్ 242.85గా ఉంది. ఓ సెంచరీతో పాటు నాలుగు ఫిఫ్టీలు అతని ఖాతాలో ఉన్నాయి. ఈ సీజన్‌లో వైభవ్ బెస్ట్ స్కోరు 103. 280 బంతులు ఎదుర్కొన్న అతను మొత్తం 55 ఫోర్లు 65 సిక్సర్లు బాదాడు.

## కార్లసన్‌కు షాకిచ్చిన ప్రజ్ఞానంద ..

**-నార్వే చెస్ టోర్నీలో సంచలనం**



**ఓస్లో:**
భారతీయ గ్రాండ్‌మాస్టర్ ఆర్ ప్రజ్ఞానంద సంచలనం సృష్టించాడు. ప్రపంచ నెంబర్ వన్ ప్లేయర్ మాగ్నస్ కార్లసన్‌పై అద్భుత విజయం సాధించారు. నార్వే చెస్ టోర్నమెంట్‌లో స్వంతగడ్డపై కార్లసన్‌ను ప్రజ్ఞానంద ఓడించాడు. దీంతో మూడు ఫుల్ పాయింట్లను అతను తన ఖాతాలో వేసుకున్నాడు. ఇక వరల్డ్ చాంపియన్ డీ గుకేశ్ మాత్రం మరో ఓటమిని మూటకట్టుకున్నాడు.నార్వేలో కార్లసన్ అజేయయాత్రకు ప్రజ్ఞానంద మరోసారి బ్రేక్ వేశారు. ఏడు సార్లు చాంపియన్ అయిన కార్లస్‌న్‌ను ఆయన స్వంత దేశంలోనే మళ్లీ ఓడించారు. చెస్ చరిత్రలో ఇదో ఘనమైన రికార్డుగా భావిస్తున్నారు. గత ఏడాది కూడా ఇక్కడే కార్లసన్‌పై ప్రజ్ఞానంద విక్టరీ కొట్టాడు. ఇటీవల రొమేనియాలోని బుచారెస్ట్‌లో జరిగిన సూపర్‌బెట్ చెస్ క్లాసిక్ టోర్నీలో ప్రజ్ఞానంద విజయం సాధించారు. అయితే ఆ కాన్ఫిడెన్స్‌తోనే తాజాగా నార్వే చెస్ టోర్నీలో అతను అడుగుపెట్టాడు. ప్రస్తుతం కార్లసన్ కేవలం 1.5 పాయింట్లతో పోరాడుతున్నారు. నార్వే చెస్‌లో క్లాసిక్ విభాగంలో రెండోసారి ప్రజ్ఞానంద గెలుపొందాడు.డీ గుకేశ్‌పై విజయం సాధించిన ఫిరౌజా ప్రస్తుతం టోర్నీలో టాప్ ప్లేస్‌లో దూసుకెళ్తున్నాడు. అతను క్లాసిక్ గేమ్‌లో కీలకమైన 1.5 పాయింట్లు సాధించి మొత్తం 7.5 పాయింట్లతో అగ్రస్థానంలో ఉన్నారు. ఇవాళ ఫోర్త్ రౌండ్‌లో గుకేశ్, కార్లసన్ మధ్య మ్యాచ్ జరగనున్నది. ఈ మ్యాచ్‌పైనే అందరి దృష్టి నెలకొన్నది.

## ఐపీఎల్‌లో హనీ ట్రాప్ కలకలం..

ఐపీఎల్ 2026 సీజన్ ముగింపు దశకు చేరుకుంటున్న వేళ.. తెరవెనుక వివాదాలు సోషల్ మీడియాను షేక్ చేస్తున్నాయి. ఈ నెల ప్రారంభంలో బీసీసీఐ సెక్రటరీ దేవజిత్ సైకియా మీడియా సమావేశంలో ఉపయోగించిన హనీ-ట్రాప్ అనే పదం క్రికెట్ వర్గాల్లో పెద్ద దుమారానికి కారణమైంది. ఈ వ్యాఖ్యలు బయటకు రాగానే సోషల్ మీడియాలో రకరకాల పుకార్లు షికారు చేశాయి. కొందరు ఆకతాయిలు ఏకంగా ఐపీఎల్ క్రికెటర్ల భార్యలు, పార్ట్‌నర్లను టార్గెట్ చేస్తూ ట్రోలింగ్, వేధింపులకు దిగడంతో గందరగోళ వాతావరణం నెలకొంది. ఈ వివాదంపై ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ చైర్మన్ అరుణ్ ధుమాల్ తాజాగా స్పందిస్తూ కీలక వివరణ ఇచ్చారు. ప్రస్తుత ఐపీఎల్ సీజన్లో ఎలాంటి హనీ-ట్రాపింగ్ ఉదంతాలు తమ దృష్టికి రాలేదని ఆయన స్పష్టం చేశారు. ఐపీఎల్ అనేది అత్యంత పారదర్శకంగా, స్వచ్ఛంగా సాగుతున్న టోర్నమెంట్ అని, ఇలాంటి లేనిపోని పుకార్లను నమ్మవద్దని ఆయన అభిమానులను కోరారు. అయితే ఈ సీజన్లో ఆటగాళ్లు, సపోర్ట్ స్టాఫ్, ఫ్రాంచైజీల మేనేజ్‌మెంట్ వైపు నుంచి కొన్ని క్రమశిక్షణా ఉల్లంఘనలు, ప్రోటోకాల్



వివాదాలు జరిగిన మాట నిజమేనని బీసీసీఐ అంగీకరించింది. ఇలాంటి సంఘటనలను ముందే అరికట్టకపోతే టోర్నమెంట్‌తో పాటు బోర్డు ప్రతిష్టకు భంగం వాటిల్లుతుందని బీసీసీఐ సెక్రటరీ దేవజిత్ సైకియా 10 ఐపీఎల్ ఫ్రాంచైజీల సీఈఓలకు ఒక సుదీర్ఘమైన హెచ్చరిక లేఖ రాశారు. ఆటగాళ్ల భద్రత, లీగల్ సమస్యలను దృష్టిలో ఉంచుకుని అపరిచిత వ్యక్తులను హోటల్ గదుల్లోకి రానివ్వకూడదని, యాంటీ కరప్షన్ ప్రోటోకాల్స్ కచ్చితంగా పాటించాలని అందులో ఆదేశించారు. లీగ్ సాఫీగా సాగుతోందని చెబుతూనే, రాజస్థాన్ రాయల్స్ కెప్టెన్ రియాన్ పరాగ్ డ్రెస్సింగ్ రూమ్‌లో ఈ-సిగరెట్ లేదా వేపింగ్ చేసిన ఉదంతాన్ని ఐపీఎల్ చైర్మన్ అరుణ్ ధుమాల్ ప్రస్తావించారు. టీవీ లైవ్ బ్రాడ్‌కాస్ట్‌లో రియాన్ పరాగ్ వేప్ పట్టుకుని కనిపించడంపై దేశవ్యాప్తంగా విమర్శలు వచ్చాయి. ఇలాంటి చిన్నపాటి సంఘటనలను మనం ముందే నివారించాల్సి ఉండాల్సిందని, ఆ ఒక్క వివాదం మినహా ఈ సీజన్లో ఎలాంటి పెద్ద తప్పులు జరగలేదని ఆయన అన్నారు. సెక్రటరీ దేవజిత్ సైకియా చేసిన నిర్దిష్ట వ్యాఖ్యల గురించి తనకు పూర్తి సమాచారం లేదని, దానిపై ఆయనే మాట్లాడాలని ధుమాల్ పేర్కొన్నారు. వివాదాలను పక్కనబెడితే, ఆట పరంగా ఐపీఎల్ 2026 సీజన్ అత్యంత అద్భుతంగా సాగిందని ఐపీఎల్ చైర్మన్ కొనియాడారు. మునుపటి సీజన్ల లాగే, ఈసారి కూడా లీగ్ స్టేజ్ చివరి రోజు వరకు ఏ ఏ నాలుగు జట్లు ప్లే-ఆఫ్స్‌కు క్వాలిఫై అవుతాయో ఎవరికీ అర్థం కాలేదని, అదే ఐపీఎల్ కి ఉన్న అసలైన బ్యూటీ అని ఆయన అన్నారు. మ్యాచ్‌ల క్వాలిటీ, ఆటగాళ్ల ప్రదర్శన ఈసారి నెక్స్ట్ లెవెల్‌లో ఉందంటూ ఆయన హర్షం వ్యక్తం చేశారు.

# స్పిరిట్'లో త్రిప్తి దిమ్రి పాత్రపై ఆసక్తికర వ్యాఖ్యలు..

## -సందీప్ వంగా హీరోయిన్ల పాత్రలను అలా రాస్తారు




పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ హీరోగా దర్శకుడు సందీప్ రెడ్డి వంగా తెరకెక్కిస్తున్న భారీ చిత్రం 'స్పిరిట్'పై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ చిత్రంలో బాలీవుడ్ బ్యూటీ త్రిప్తి దిమ్రి హీరోయిన్‌గా నటిస్తుండటంతో సినిమాపై మరింత ఆసక్తి పెరిగింది. అయితే తాజాగా ప్రముఖ దర్శకుడు హేమంత్ మధుకర్ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. సందీప్ రెడ్డి వంగా సినిమాల్లో హీరోయిన్ పాత్రల గురించి మాట్లాడిన హేమంత్ మధుకర్.. ఆయన సినిమాల్లో కనిపించే రొమాంటిక్ సన్నివేశాలను చూసి హీరోయిన్లకు కేవలం గ్లామర్ పాత్రలే ఉంటాయని అనుకోవడం తప్పని అన్నారు. సందీప్ తన కథల్లో మహిళా పాత్రలను చాలా బలంగా, భావోద్వేగాలకు దగ్గరగా రాస్తారని పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఆయన 'అర్జున్ రెడ్డి'లో శాలినీ పాండే పోషించిన ప్రీతి పాత్రను, అలాగే 'యానిమల్'లో రష్మిక మందన్న చేసిన గీతాంజలి పాత్రను ఉదాహరణగా చెప్పారు. ఆ పాత్రలు కేవలం హీరోకు జోడీగా మాత్రమే కాకుండా కథలో కీలకమైన భావోద్వేగ బలాన్ని ఇచ్చాయని అన్నారు. త్రిప్తి దిమ్రి ఎంపికపై కూడా హేమంత్ స్పందించారు. నటీనటుల మధ్య పోలికలు పెట్టడం సరికాదని, ప్రతి పాత్రకు తగిన నటుడిని లేదా నటిని దర్శకుడు ఎంపిక చేస్తాడని చెప్పారు. 'స్పిరిట్'లోని పాత్రకు త్రిప్తి దిమ్రి పూర్తిగా సూట్ అవుతుందని భావించి సందీప్ ఆమెను ఎంపిక చేశారని వెల్లడించారు. అంతేకాదు, ఈ సినిమాలో త్రిప్తి నటన ప్రేక్షకుల అంచనాలను మించేలా ఉంటుందని హేమంత్ మధుకర్ ధీమా వ్యక్తం చేశారు. ఇప్పటికే 'యానిమల్' సినిమాతో త్రిప్తి దిమ్రికి దేశవ్యాప్తంగా మంచి గుర్తింపు వచ్చింది. ఇప్పుడు ప్రభాస్ సరసన 'స్పిరిట్'లో నటించడం ఆమె కెరీర్‌లో మరో కీలక మలుపుగా మారనుందని సినీ వర్గాలు భావిస్తున్నాయి. ఇక 'స్పిరిట్' సినిమా విషయానికి వస్తే.. ఇది పవర్‌ఫుల్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కుతోంది. ఈ చిత్రంలో ప్రభాస్ ఓ పోలీస్ ఆఫీసర్ పాత్రలో కనిపించనున్నట్లు సమాచారం. సందీప్ రెడ్డి వంగా స్టైల్‌లో యాక్షన్, ఎమోషన్, ఇంటెన్స్ డ్రామాతో ఈ సినిమా రూపొందనుండటంతో అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ప్రస్తుతం ఈ సినిమా ప్రీ-ప్రొడక్షన్ పనులు వేగంగా జరుగుతున్నాయి. త్వరలోనే షూటింగ్ ప్రారంభం కానున్నట్లు సమాచారం.



## లేలేత అందాలతో మాయ చేస్తున్న ఆషికా రంగనాథ్!

# ఎల్లమ్మగా మమితాబైజు?

బలగం' తర్వాత దర్శకుడు 'ఎల్లమ్మ' సినిమా ప్రకటించిన నాటినుంచీ ఈ సినిమాలో నటించే తారల వ్యవహారం ఓ ప్రహసనంగా మారింది. హీరోగా ముందు చాలామంది పేర్లు అనుకున్నారు. చివరకు సంగీత దర్శకుడు దేవిశ్రీప్రసాద్ ఖరారయ్యారు. ఆయనపై తాజాగా గ్లింప్స్ కూడా రిలీజ్ చేశారు. ఇక 'ఎల్లమ్మ'లో హీరోయిన్ ఎవరు? ప్రస్తుతం ఫిల్మ్ వర్గాలను వెంటాడుతున్న ప్రశ్న ఇది. మొదట్లో సాయిపల్లవి అన్నారు.ఆ తర్వాత కీర్తి సురేశ్ పేరు వినిపించింది. ఈ వరుసలోనే చాలామంది హీరోయిన్ల పేర్లు మీడియాలో చక్కర్లు కొట్టాయి. చివరకు మలయాళ మందారం మమితాబైజు ఖరారైందంటూ ఓ వార్త బలంగా వినిపిస్తున్నది. అయితే.. ఈ పేరు బయటకు వచ్చిన నాటినుంచీ, ప్రేమలు, డ్యూడ్ లాంటి ట్రెండీ క్యారెక్టర్లు చేసే మమితాబైజు ఈ విలేజ్ డ్రామాలో ఇమడగలదా? అనే అనుమానాలను పలువురు వ్యక్తం చేస్తున్నారు. అయితే.. ధనుష్ 'కర' సినిమాలో ఆమెది విలేజ్ నేపథ్య పాత్రేననీ, తను స్వతహాగా మంచినటి కాబట్టి, ఎలాంటి పాత్రనైనా అలవోకగా చేయగలదని పలువురు అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు. ఏది ఏమైనా అధికారిక ప్రకటన వచ్చేదాకా ఇవన్నీ ఊహాగానాలే అనాలి.



# మీరు గర్వించేలా నటిస్తాను



మరాఠీ మందారం భాగ్యశ్రీబోర్సే భావోద్వేగానికి లోనైంది. జాతీయ నటుడు కమల్‌హాసన్ సొంత నిర్మాణ సంస్థలో నిర్మితమవుతున్న 'సెయాన్' చిత్రంలో ఆమె కథానాయికగా నటిస్తున్న విషయం తెలిసిందే. తాజాగా ఈ ముద్దుగుమ్మ కమల్‌హాసన్‌ని కలిసింది. ఈ సందర్భంగా ఆయనతో దిగిన ఫొటోలను సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తూ.. 'డియర్ కమల్‌హాసన్ సార్.. చిన్నప్పట్నుంచీ మిమ్మల్ని తెరపై చూస్తూ పెరిగాను.ఇప్పుడు ఈ చిన్న అమ్మాయి మీ సినిమాలోనే నటిస్తున్నది. నా తలపై చేయి ఉంచి, మీరు ఆశీర్వదించినప్పుడు నేను అనుభవించిన ఆనందాన్ని మాటల్లో వర్ణించలేను. మీరు గర్వపడేలా నటిస్తానని ప్రమాణం చేస్తున్నాను' అంటూ రాసుకొచ్చింది భాగ్యశ్రీ బోర్సే. ఇక 'సెయాన్' సినిమా విషయానికొస్తే.. ఇది గ్రామీణ నేపథ్యంతో కూడిన కథ. మాస్ యాక్షన్, వినోదంతోపాటు కుటుంబ ప్రేక్షకుల్ని అలరించే భావోద్వేగాలు కూడా ఈ కథలో ఉంటాయని మేకర్స్ చెబుతున్నారు. 'అమరన్' విజయం తర్వాత కమల్‌హాసన్ నిర్మాణసంస్థలో శివకార్తికేయన్ నటిస్తున్న రెండో సినిమా ఇది. శివకుమార్ మురుగేశన్ తెరకెక్కిస్తున్న ఈ చిత్రం అక్టోబర్‌లో విడుదల కానున్నది.

# పెద్ది' ప్రమోషన్స్‌కు నెక్స్ట్ లెవెల్ హైప్..

## 'మస్సా మస్సా' సాంగ్ అదిరిపోయిందంటున్న ఫ్యాన్స్!




గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ హీరోగా, టాలెంటెడ్ డైరెక్టర్ బుచ్చిబాబు సన దర్శకత్వంలో తెరకెక్కుతున్న మోస్ట్ అవేటెడ్ పాన్ ఇండియా మూవీ 'పెద్ది' విడుదలకు సిద్ధమవుతోంది. భారీ అంచనాల మధ్య రూపొందిన ఈ ప్రతిష్టాత్మక చిత్రం జూన్ 4న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా థియేటర్లలోకి రానుంది. ఇప్పటికే విడుదలైన పోస్టర్లు, టీజర్, ట్రైలర్ సినిమాపై అంచనాలను ఆకాశానికెత్తగా.. ఇప్పుడు ప్రమోషన్స్ కూడా అదే స్థాయిలో దూసుకెళ్తున్నాయి. ఈ చిత్రంలో రామ్ చరణ్ సరసన బాలీవుడ్ బ్యూటీ జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తోంది. కన్నడ స్టార్ శివరాజ్ కుమార్ కీలక పాత్రలో కనిపించనుండగా.. జగపతిబాబు, దివ్యేందు శర్మ, బొమన్ ఇరానీ వంటి నటీనటులు ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. ఆస్కార్ విజేత ఏఆర్ రెహమాన్ సంగీతం అందిస్తుండటంతో మూవీపై మ్యూజిక్ పరంగా కూడా భారీ అంచనాలు ఏర్పడ్డాయి.ప్రస్తుతం దేశవ్యాప్తంగా 'పెద్ది' ప్రమోషన్స్ జోరుగా సాగుతున్నాయి. బ్యాక్ టు బ్యాక్ ఇంటర్వ్యూలు, ఈవెంట్లు, ప్రెస్ మీట్స్‌తో చిత్ర బృందం ఫుల్ బిజీగా ఉంది. ఈ నేపథ్యంలో తాజాగా దేశ రాజధాని ఢిల్లీలో భారీ ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలోనే మూవీ నుంచి మోస్ట్ అవేటెడ్ ట్రాక్ 'మస్సా మస్సా' సాంగ్‌ను మేకర్స్ విడుదల చేశారు. ఈ పాట విడుదలైన కొద్ది గంటల్లోనే సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఎనర్జిటిక్ బీట్‌లు, ఇన్‌స్పిరేషనల్ లిరిక్స్, రామ్ చరణ్ స్టైలిష్ ప్రెజెన్స్ అభిమానులను విపరీతంగా ఆకట్టుకుంటున్నాయి. ముఖ్యంగా ఏఆర్ రెహమాన్ కంపోజిషన్‌కు ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందన వస్తోంది. చాలా మంది ఈ పాటను ఇప్పటికే చార్ట్‌బస్టర్‌గా ప్రకటిస్తూ సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు.అయితే ఈ సాంగ్‌పై అభిమానుల మధ్య ఒక ఆసక్తికరమైన చర్చ కూడా నడుస్తోంది. తెలుగు వెర్షన్ కంటే హిందీ వెర్షన్‌లో 'మస్సా మస్సా' పాట మరింత పవర్‌ఫుల్‌గా ఉందంటూ నెటిజన్లు కామెంట్స్ చేస్తున్నారు. హిందీ లిరిక్స్, వోకల్స్, బీట్ మిక్సింగ్ ఆడియన్స్‌ను ఎక్కువగా ఆకట్టుకుంటున్నాయని అభిప్రాయపడుతున్నారు. దీంతో సోషల్ మీడియాలో తెలుగు వర్సెస్ హిందీ వెర్షన్‌పై డిబేట్ కూడా మొదలైంది. ఇప్పటికే ట్రైలర్‌తో భారీ హైప్ క్రియేట్ చేసిన 'పెద్ది' టీమ్.. ఇప్పుడు 'మస్సా మస్సా' పాటతో ప్రమోషన్స్‌ను మరో స్థాయికి తీసుకెళ్లిందని అభిమానులు చెబుతున్నారు. గ్రామీణ నేపథ్యంలో స్పోర్ట్స్, యాక్షన్, ఎమోషన్స్ తో రూపొందుతున్న ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద సంచలనాలు సృష్టిస్తుందనే నమ్మకంతో మెగా అభిమానులు ఎదురుచూస్తున్నారు.

Edited,Printed,Published & Owned by Mr.Nakka Raju, RNI No : TGTEL/26/A0738, Printed at NEWS 24HRS MEDIA SERVICES,Suryapet,- 508213 Telangana.
Published at 1-113 Prabhat Nagar,Chaitanyapuri,Rangareddy,Telangana - 500060.Telangana State. EDITOR : Mr.NAKKA RAJU, Cell 9160600610 | netibharath.daily@gmail.com